నవతెలంగాణ
ఆదిలాబాద్
శనివారం | మార్చి 29, 2025 | www.navatelangana.com

నీలుగాయిని హతమార్చిన నిందితుల పట్టివేత

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

నీలుగాయిని హతమార్చిన నిందితులను పట్టుకున్నట్లు పెంచికల్‌పేట్ రేంజ్ అధికారి అనిల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో ముందస్తు సమాచారం మేరకు లోడ్‌పల్లి అటవీ ప్రాంతంలో నేలుగాయిని వేటాడినట్లు తెలిసిన సమాచారం మేరకు అటవీశాఖ అధికారులు దాడులు చేశారు. హతమార్చిన ఆరుగురు నిందితుల్లో చాపిడే వెంకటేష్, దుర్గం రవీందర్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. మిగతావారు ఆత్రం రవి, గొర్లపల్లి మొండి, ఆత్రం భీమయ్య, మన్నేపల్లి శ్రీహరి పరారయ్యారు. దాడుల్లో సెక్షన్ అధికారి శంకర్, బీట్ అధికారులు సంగదీప్, సతీష్, లచ్చన్న, మనోహర్, అనిమల్ ట్రాకర్లు శ్రీకాంత్, వెంకటేష్ పాల్గొన్నారు.



తుడుందెబ్బ రాష్ట్ర మహాసభల కరపత్రం ఆవిష్కరణ

ఆసిఫాబాద్ : ఏప్రిల్ 12 ,13, 14 తేదీలలో జిల్లాలోని జోడేఘాట్‌లో నిర్వహించే తుడుందెబ్బ రాష్ట్ర మహాసభల కరపత్రాన్ని కేంద్రంలో సంఘం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట్నక విజయకుమార్, జిల్లా అధ్యక్షులు కోవ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆదివాసుల కోసం 28 ఏళ్ల నుంచి పోరాటం చేస్తున్న తుడుందెబ్బ ఉద్యమ సమీక్ష, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రకటన, ఆదివాసీల అస్తిత్వం మనుగడ కోసం అమరత్వం పొందిన కొమురంభీం నడయాడిన జోడేఘాట్ గడ్డపైన నిర్వహించే మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సంఘం బలోపేతం చేయడంతో పాటు ఆదివాసీ హక్కుల రక్షణకు చేసే పోరాటంపై భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఆదివాసులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూర్ మారుతి, జిల్లా నాయకులు లాల్‌శావ్, కనక రమేష్ పాల్గొన్నారు.



రైతాంగానికి బీజేపీ ఇచ్చిన హామీని అమలు చేయాలి



ఆదిలాబాద్‌టౌన్ : రైతాంగానికి కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ మూడ్ శోభన్ డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఎస్‌కెఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవంత్‌సింగ్ మాన్ నేతృత్వంలో పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆ రాష్ట్ర పోలీసులు జగ్జీత్‌సింగ్ దల్లెవాల్, శ్రవాన్‌సింగ్ పాంధర్‌తో సహా 350 మంది రైతు నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి జైళ్లో పెట్టారన్నారు. మార్చి 3, 4 తేదీలలో పంజాబ్ అంతటా ఇలాంటి అణచివేత కొనసాగిందని, మార్చి 5 నుండి చండీగఢ్‌లో ఎస్‌కెఎం ప్రకటించిన ప్రదర్శన వారం రోజుల ధర్నాను అడ్డుకోవడానికి బల్బీర్‌సింగ్ రాజేవాల్, రుల్దుసింగ్ మాన్సా వంటి నాయకులు సహా 800 మందికిపైగా ఎస్‌కెఎం కార్యకర్తలను అరెస్టు చేసి జైలులో పెట్టారని తెలిపారు. ఇటువంటి వరుస పోలీసు అణచివేత ఆప్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం రైతుల జీవితాలను, జీవనోపాధిని నాశనం చేసిన కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపే హక్కును బలవంతంగా అణచివేస్తోందన్నారు. మార్చి 5న పంజాబ్ అంతటా భారీ శాంతియుత ప్రదర్శనలు నిర్వహిస్తే ఖనౌరి, శంభు పంజాబ్ సరిహద్దులను ఆందోళన చేస్తున్న రైతులు, కేంద్ర ప్రభుత్వ ఆదేశం మేరకు హర్యానా పోలీసులు మూసివేశారన్నారు. రైతు సంఘాలు రుణమాఫీ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్ల కోసం పోరాడుతున్నామన్నారు. నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశంలో ప్రతిరోజూ 31 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నందున వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడం ద్వారా, వారిని అప్పుల నుండి విముక్తి చేయడం ద్వారా రైతుల పోరాటాన్ని పరిష్కరించాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా నాయకులు బండి దత్తాత్రి, స్వామి, పూసం సచిన్, ఉయిక విష్ణు, సునీల్, జగన్‌సింగ్, నంది రామయ్య, శ్రీను, మహేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

కులవివక్ష, అంటరానితనం సహించబోం



ఆదిలాబాద్‌టౌన్ : నేటి ఆధునిక యుగంలో కూడా గ్రామ సీమల్లో కులవివక్ష, అంటరానితనం ప్రత్యక్షంగా, పట్టణాల్లో పరోక్షంగా కొనసాగుతోందని, దీన్ని సహించబోమని ఏప్రిల్ నెలలో జరిగే ప్రత్యక్ష ప్రతిఘటన పోరాటాలలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు అన్నారు. శుక్రవారం బాశెట్టి మాధవరావు విజ్ఞాన కేంద్రంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు జితేందర్ పవార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నేటికి దళితులకు గుడి ప్రవేశం లేని గ్రామాలు, బతుకమ్మ ఆడనీయని గ్రామాలు, క్షవరం చేయకపోవడం, దసరా పండుగ సందర్భంగా జమ్మి ఆకు తెంపారని దాడి, హోటళ్లలో రెండు గ్లాసుల పద్ధతి, పాఠశాలల్లో దళితులు మధ్యాహ్న భోజనం వంట చేస్తే విద్యార్థులు తినకపోవడం, రచ్చబండ మీద కూర్చోనియ్యకపోవడం వంటి కులవివక్ష రూపాలు కొనసాగున్నాయని అన్నారు. పట్టణాల్లో దళితులకు ఇల్లు అద్దెకు ఇవ్వడం లేదన్నారు. ఇంకా అనేక రూపాల్లో కుల వివక్ష అంటరానితనం కొనసాగుతోందన్నారు. వీటన్నింటిని పారదోలటానికి ఉన్న చట్టాలు, జీవోలు రాజ్యాంగబద్ధమైన హక్కులను పాలకవర్గాలు అమలు చేయడం లేదన్నారు. ఈ వివక్ష రూపాలప ప్రత్యక్ష ప్రతిఘటన పోరాటాలు నిర్మించాలన్నారు. ఏప్రిల్ నెల మొత్తాన్ని మహనీయుల మాసంగా కేవీపీఎస్ ప్రకటించి పూలే అంబేద్కర్ జన జాతరలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. కుల వివక్ష అంటరానితనం ఎక్కడ కొనసాగితే అక్కడ ప్రత్యక్ష ప్రతిఘటన పోరాటం నిర్మించాలన్నారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రేంజర్ల ప్రవీణ్ మాట్లాడుతూ జిల్లాలో కూడా ఇంకా కొన్ని గ్రామాల్లో దేవాలయ ప్రవేశం లేకపోవడం వంటి కులవివక్ష కొనసాగుతోందన్నారు. ఏప్రిల్ నెల మొత్తాన్ని మహనీయుల మాసంగా ప్రకటించుకొని వారి స్ఫూర్తితో కులవివక్షపై ప్రతిఘటన పోరాటాలు నిర్మిస్తామని చెప్పారు. జిల్లాలో అన్ని రాజకీయ పార్టీలు, సంఘాలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.గంగన్న, స్వామి, ప్రేమ్‌కుమార్, చరణ్ పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి



మంచిర్యాల : కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని కోరుతూ చేసే పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలను జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి సభ్యులు శుక్రవారం శ్రీహర్ష కాలేజీలో విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఏప్రిల్ 16న మంచిర్యాల ఐబీ చౌరస్తా నుండి హాజీపూర్ వరకు చేపట్టే పాదయాత్రలో బీసీ కుల సంఘాలు, బీసీ వాదులు పాల్గొని జయప్రదం చేయలని కోరారు. 1931లో బ్రిటిష్ ప్రభుత్వం బిసి కులగణన చేపట్టిందని, అప్పటి నుండి ఏ ప్రభుత్వం కులగణన చేపట్టిన పాపానపోలేదని తెలిపారు. ఇది బీసీలపై వివక్షగా భావిస్తున్నామన్నారు. కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాలు ఉద్యమాలు చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా దేశ వ్యాప్త కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీసీ సమాజం ముందు బీజేపీని దోషిగా నిలబెడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్, నాయకులు చుంచు రాజ్‌కిరణ్, కర్రె లచ్చన్న, శాఖపురి భీంసేన్, గజ్జెల్లి వెంకన్న, రాష్ట్ర కార్యదర్శి అక్కల రమేష్, బండోజు రాజమౌళి, అంకం సతీష్, చంద్రగిరి చంద్రమౌళి, షేక్ సల్మాన్, బండ సతీష్, సురేందర్‌చారి, ఆరెందుల రాజేశం, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

పెంచికల్‌పేట్ : అక్రమంగా తరలిస్తున్న పశువుల వాహనాన్ని ఎస్సై కొమురయ్య ఎలకపల్లి శివారులోని పెట్రోల్ బంకు వద్ద పట్టుకున్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..బెజ్జూర్ మండలం మర్దిడి గ్రామం నుంచి బొలెరో వాహనంలో ఎద్దులను తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు ఉదయం 5 గంటలకు తనిఖీ చేశారు. కరీంనగర్‌కు చెందిన జాఫర్, రఫీ, కుకుడ గ్రామానికి చెందిన శ్రీశైలంను పట్టుకొని కేసు నమోదు చేశారు.

ఐక్యంగా పోరాడితేనే విజయం

- సీసీఐ కోసం ఢిల్లీ స్థాయిలోనూ పోరాటం చేద్దాం
- అదానీకి విక్రయించడానికి కేంద్రం ప్రయత్నం
- బీజేపీ ఎమ్మెల్యే, ఎంపీలు రాజీనామా చేయాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



బహిరంగ సభలో అభివాదం చేస్తున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, జిల్లా సీసీఐ సాధన కమిటీ సభ్యులు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్‌టౌన్

సీసీఐ పరిశ్రమ పున ప్రారంభం కోసం రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, యువత, పట్టణ వాసులు అందరూ ఐక్యంగా పోరాడితే విజయం సాధించడం సులువుగా మారుతుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. 27ఏండ్ల నుంచి ఈ పరిశ్రమ మూతపడటంతో సుమారు 10వేల మంది కార్మికులు రోడ్డు పాలయ్యాయని, వారి జీవితాలను బీజేపీ ఛిద్రం చేసిందని మండిపడ్డారు. అదానీకి కేవలం రూ.43వేల కోట్లకు ఈ పరిశ్రమ సంపదను ధారాదత్తం చేసేందుకు కేంద్రం తక్కుకింద విక్రయించడానికి సిద్ధపడుతోందని మండిపడ్డారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన మూతపడిన సిమెంట్ పరిశ్రమను సందర్శించారు. ఈ సందర్భంగా సీసీఐ సాధన కమిటీ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం పరిశ్రమను సందర్శించిన ఆయన అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భూనిర్వాసిత రైతులతో మాట్లాడి వారి సమస్యను ఆలకించారు. అక్కడి నుంచి పట్టణం పురవీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. సీసీఐ సాధన కమిటీ కన్వీనర్ దర్శనాల మల్లేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ముఖ్య వక్తగా మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వ సంపదను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తోందని మండిపడ్డారు. సీసీఐ పరిశ్రమ నడిపించడానికి 100ఏండ్లకు సరిపడా ముడి సరుకు ఉన్నా బీజేపీ ప్రభుత్వం పునరుద్ధరణకు సిద్ధపడటం లేదని మండిపడ్డారు. గతంలో అధికారంలోకి వస్తే ఈ పరిశ్రమను తెరిపిస్తామని ఇచ్చిన హామీని ఆ పార్టీ ఎందుకు అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోట్ల సంపదను కొద్దిమంది చేతుల్లో పెట్టి మెజార్టీ ప్రజలను గాలికొదిలేస్తోందని ధ్వజమెత్తారు. విమానయానం, రైల్వే, ఎల్ఐసీ వంటి సంస్థలను ప్రయివేటుపరం చేసిందని, ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ ప్రయివేటుకు అప్పగిస్తోందని పేర్కొన్నారు. ధనిక వర్గాలు చేస్తున్న దోపిడికి అనుకూలంగా వ్యవహరిస్తోందని తెలిపారు. ఇలా చేస్తే పేదవర్గాల పరిస్థితి ఏం కావాలని ప్రశ్నించారు. పోరాడి సాధించుకున్న కోట్లాది మంది కార్మికుల హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. బీజేపీ యజమానుల పక్షం వహిస్తూ కార్మికుల శ్రమ దోపిడికి పాల్పడుతోందని వ్యాఖ్యానించారు. రైతులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుండటంతో దేశంలో లక్షలాది మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రామికవర్గాలకు వ్యతిరేకంగా రాజకీయ దళారులకు అండగా నిలుస్తోందని చెప్పారు. సీసీఐ భూములను అమ్మేసే ప్రయత్నం చేస్తోందని పరిశ్రమను మూసేయడంతో పాటు మళ్లీ తెరిపిస్తామని ఓట్లు బీజేపీ వాళ్లు మళ్లీ ఓట్లు అడుగుతారని తెలిపారు. విద్యను సైతం ప్రయివేటు పరం చేస్తోందని, 80శాతం మంది ఏకమైతే మనమే పదవుల్లో ఉండొచ్చని ప్రభుత్వాలను అడుక్కునే పరిస్థితి రాదని గుర్తుచేశారు. హక్కులు సాధించుకునేందుకు కార్మికవర్గాలన్ని ఒక్కటి కావాలని, సంఘటితమైతేనే శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. సీసీఐని తెరిపిస్తామని బీజేపీ ఎమ్మెల్యే, ఎంపీ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, ఈ పరిశ్రమ తెరిపించడానికి కేవలం రూ.2వేల కోట్లు మాత్రమే ఖర్చవుతుందని తెలిపారు. ఈ నిధులను రాబట్టి తెరిపించాలని లేదంటే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సీసీఐని తెరిపించే వరకు సాధన కమిటీ పోరాడుతుందని తమ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఢిల్లీస్థాయిలోనూ ఉద్యమాన్ని విస్తరించి అన్ని పార్టీల మద్దతు కూడగడుదామని పార్లమెంటులో ఈ అంశం చర్చకు వచ్చేలా చేస్తామని తెలిపారు. పరిశ్రమ వేలం పాటకు కాంగ్రెస్ అడ్డుపడాలని, కేంద్రం మీద రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బండారు రవికుమార్, సీసీఐ సాధన కమిటీ కోకన్వీనర్ విజ్జగిరి నారాయణ, సభ్యులు అలాల అజయ్, గుడిపెల్లి నగేష్, సాజిద్‌ఖాన్, నంది రామయ్య, ముడుపు ప్రభాకర్‌రెడ్డి, వెంకట్ నారాయణ, బండి దత్తాత్రి, లంక రాఘవులు, బొల్లు ఈశ్వర్‌దాస్, దాసరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వల్ప వాగ్వివాదం..!

సీసీఐ సాధన కమిటీ సభ్యులు, భూనిర్వాసితులు ఉదయం పరిశ్రమ దగ్గరకు వెళ్లడానికి సిద్ధమయ్యారు. లాండసాంగ్వి మార్గం వైపు గేట్ నుంచి లోనికి వెళ్లేందుకు ప్రయత్నించగా.. సీసీఐ జనరల్ మేనేజర్ అనుమతి లేదని నిరాకరించారు. దీంతో సాధన కమిటీ సభ్యులు, అధికారికి మధ్య స్వల్ప వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో పోలీసులు సాధన కమిటీ సభ్యులకు నచ్చజెప్పి శాంతింపజేశారు. చివరకు జనరల్ మేనేజర్ అక్కడి నుంచి వెళ్లిపోవడం..అనంతరం జాన్‌వెస్లీ అక్కడికి రావడంతో పరిశ్రమ దగ్గరకు నడుచుకుంటూ వెళ్లి పరిశీలించారు.



సీసీఐ వద్ద జాన్‌వెస్లీ, బండారు రవికుమార్, సీసీఐ సాధన కమిటీ సభ్యులు



పట్టణంలో బైక్ ర్యాలీ



బహిరంగ సభలో పాల్గొన్న ప్రజలు

ఖాళీ బిందెలతో కాలనీవాసుల నిరసన



నవతెలంగాణ-జైపూర్

దాహర్తి తీర్చాలని కోరుతూ చెన్నూర్ మండలం బావురావుపేట్ ఆదివాసీ కాలనీవాసులు ఖాళీ బిందెలతో నిరసన ప్రదర్శన చేపట్టారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో శుక్రవారం చెన్నూర్ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి సంకె రవి మాట్లాడుతూ బావురావుపేట్ కాలనీవాసులు రెండు సంవత్సరాలుగా తాగు నీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజాప్రతినిధులు ఓట్లు వేయించుకోవడం తప్ప ప్రజల సమస్యల పట్ల చిత్తశుద్ధి లేదని విమర్శించారు. బావురావుపేట్ కాలనీ వాసులకు రోడ్డు సౌకర్యంతో పాటు గొంతు తడుపుకోవడానికి గుక్కెడు మంచి నీళ్లు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. 800 కుటుంబాలు 400 మంది బావురావుపేట్‌లో ఉంటున్నారని, ప్రతి వేసవిలో తాగు నీటి కోసం రెండు కిలో మీటర్లు దూరం వెళ్లాల్సిన పరిస్థితులున్నా పాలకులు పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు కాలనీలో ఇంటింటికి తిరుగుతూ చేపట్టిన సర్వే ద్వారా గుర్తించిన సమస్యలను పరిశీలిస్తే నియోజకవర్గ కేంద్రంలో ఇంతటి దుర్భర పరిస్థితుల్లో జీవించాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయా? అని అన్పిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు బోడంకి చందు, శ్యామల, ఉమారాణి, సిడాం సమ్మక్క, భూదక్క, సరిత, నగేష్, రమాదేవి, యామిని,శంకరక్క, చిన్నక్క పాల్గొన్నారు.

అభివృద్ధిని ఓర్వలేక తప్పుడు ప్రచారం

నవతెలంగాణ-జైపూర్



ఎమ్మెల్యే గడ్డం వివేక్ నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషిని ఓర్వలేని బీఆర్‌ఎస్ నాయకులు సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఎస్సై శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే వివేక్ వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కల్గిస్తున్న వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలో పది సంవత్సరాలుగా చేపట్టని అభివృద్ధికి ప్రస్తుత ఎమ్మెల్యే వివేక్ కృషి చేస్తున్నారని తెలిపారు. అంతే కాకుండా నియోజకవర్గంలో ఎక్కడే ఎలాంటి ఇబ్బంది ఎదురైనా ఒక్క ఫోన్ కాల్‌తో స్పందించి సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్న తీరును బీఆర్‌ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా తప్పుడు ప్రచారం మానుకుని అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంమోహన్, అనిల్, అభిరామ్, ఫారుక్, సతీష్, వెంకటేష్, శంకరయ్య పాల్గొన్నారు.

అక్రమ పట్టాలు రద్దు చేయాలని ఆదివాసుల నిరసన



కెరమెరి: ఆదివాసుల భూముల సమస్యలను పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో అక్రమార్కులు విచ్చలవిడిగా అక్రమ పట్టాలు పొందుతున్నారని ఆరోపించారు. అనేక మందికి భూములు లేకుండానే రెవెన్యూ అధికారులు పట్టాలు జారీ చేశారని ఆరోపించారు. పార గ్రామంలో ఆదివాసుల సర్వే నంబర్‌లో ఓ గిరిజనేతరుడు అక్రమంగా బైనంబర్‌తో పట్టాలు పొందడం అన్యాయమన్నారు. అమాయక ఆదివాసులు రానున్న రోజుల్లో చాలా మోసాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ భూములకు జారీ చేసిన పట్టాలను రెవెన్యూ అధికారులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సుర్దాపూర్ గ్రామంలో ఓ గిరిజనేతరుడు ఆదివాసీ ఆరాధ్య దైవం జంగుబాయి దేవతల, ప్రతిమలు కలిగిన భూమిని ఆదివాసుల నుంచి అన్యాయంగా కబ్జా చేసుకొని అక్రమంగా పట్ట పొంది ఉన్నాడని ఆరోపించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ గడ్డం సంతోష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆత్రం రాజు, మండల ప్రధాన కార్యదర్శి సిడాం ధర్మ, ఆదివాసీ విద్యార్థి సంఘం మండల ప్రధాన కార్యదర్శి చాహకటి రాంకిషన్, తుడుందెబ్బ మండల నాయకులు తలండి జంగు, బాలకిషన్, పెందూర్ వినేష్, వల్క బాదు పాల్గొన్నారు.

రహదారికి అడ్డంగా నిర్మాణం సరికాదు



జైపూర్ : కిష్టాపూర్ గ్రామంలో అంతర్గత రహదారిలో రాకపోకలకు ఆటంకంగా ఇంటి నిర్మాణం చేపట్టడం సరికాదని తహసీల్దార్ వనజారెడ్డి అన్నారు. అదనపు ఎస్సై నాగరాజుతో కలిసి శుక్రవారం ఆ గ్రామాన్ని సందర్శించారు. భూసమస్యలపై గ్రామస్థులతో కలిసి చర్చించారు. భూవివాదాలను తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రభుత్వ భూముల విషయంలో వాస్తవ పరిస్థితులను పూర్వాపరాలు పరిశీలించిన తదుపరి శాఖపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో గల ఎరువుల దుకాణాన్ని వ్యవసాయ అధికారి మార్క్‌గ్లాడ్సన్‌తో కలిసి పరిశీలించారు. నిల్వ ఉన్న ఎరువులు, పురుగుమందులు పరిశీలించారు. ప్రభుత్వం ఆమోదించిన కంపెనీలకు చెందిన విత్తనాలు మాత్రమే అమ్మాలని సూచించారు. ప్రభుత్వం నిషేధించిన విత్తనాలు, పురుగుమందులు ఎట్టి పరిస్థితుల్లో అమ్మకూడదని హెచ్చరించారు.

చైర్మన్‌కు వామపక్ష సంఘాల వినతి



ఆసిఫాబాద్: జిల్లా పర్యటనకు వచ్చిన ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు వామపక్ష సంఘాల నాయకులు వివిధ అంశాలపై వినతి పత్రాలు అందజేశారు. కెవిపిఎస్, టిఎజిఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ స్టడీ సెంటర్‌లు మంజూరు చేయాలని, జిల్లాలో గిరిజన గ్రామాలకు రోడ్డు, తాగు నీటి సౌకర్యం కల్పించాలని, జిల్లాలో అద్దె గృహాల్లో కొనసాగుతున్న గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, జిల్లాలో బాలుర గురుకుల డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, టిఎజిఎస్ జిల్లా అధ్యక్షురాలు మలశ్రీ, జిల్లా ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్ పాల్గొన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా నాయకుడు కృష్ణమాచారి జిల్లాలోని గిరిజన హాస్టల్‌లో పనిచేస్తున్న వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. గిరిజనుల గురించి సమావేశంలో కమిషన్ చైర్మన్ గొప్పగా మాట్లాడడం సంతోషంగా ఉందని, దీన్ని నిరూపించుకోవాలంటే హాస్టల్ వర్కర్ల సమస్యల పరిష్కారంపై దృష్టి కేంద్రీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు టేకం ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షులు అరిగెల కోటయ్య పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు : అనిల్ జాదవ్



బజార్‌హత్నూర్ : నేటి బాలలే రేపటి పౌరులని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పిప్రి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు గ్రామ మహిళలు ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. అనంతరం పాఠశాల విద్యార్థులు ప్రదర్శనలతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. పాఠశాల వార్షికోత్సవాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని ఈ రోజు చదువున్న చదువే రేపు భవిష్యత్తుకు బాటలు వేస్తుందని తెలిపారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివి ఎమ్మెల్యే అయ్యాయని, మీరందరు కూడా ఉన్నత స్థాయి ఉద్యోగాల్లో, రాజకీయాల్లో రాణించాలని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలలకు ఆదరణ పెరిగిందని, అన్ని సౌకర్యాలతో ప్రయివేటుకు ధీటుగా విద్య బోధన ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సన్మానం

నవతెలంగాణ-బోథ్

సొనాల మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ దుర్గం రాజేశ్వర్‌ను శుక్రవారం ఏఐసీసీ కోర్డినేటర్ తుల అరుణ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనను సన్మానించారు. అలాగే సొనాల మండలంలోని పలు సమస్యల గురించి, ఎంపీడీఓకు వివరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ లోల పోశెట్టి, నాయకులు తుల అజయ్, ముండే శ్రీధర్, హరి సింగ్, గంగాధర్, చెట్లపల్లి సుధీర్, జుంగాల భోజన్న పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని దేగామ గ్రామానికి చెందిన దుర్వ సూర్యబాన్ మాతృమూర్తి ఇటీవల అనారోగ్యంతో మరణించింది. శుక్రవారం విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ బొల్లారపు బాబన్న, కాంగ్రెస్ మండల కన్వీనర్ రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీ లస్మన్న యాదవ్, వెంకన్న యాదవ్, నాయకులు కాంతారావు, సుభాష్, రావుల నారాయణ, గ్రామస్తులు ఉన్నారు.



పుస్తక రచయితకు సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రానికి చెందిన గోస్కుల సత్యనారాయణ స్వయంగా భారతీయ పాశ్చాత్య శాస్త్రవేత్తలు అనే పుస్తకాన్ని విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో రూపకల్పన చేశారు. ఈ సందర్భంగా ప్రాథమికోన్నత పాఠశాల, జామిని తరుపున ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శుక్రవారం ఆయన నివాసంలో సన్మానం చేశారు. జామిని పాఠశాలకు భారతీయ పాశ్చాత్య శాస్త్రవేత్తలు అనే పుస్తకాలను స్కూల్ లైబ్రరీకి అందజేశారు. సంకలన సంపుటి రచయిత కృషిని అభినందనలు తెలియజేశారు. సంకలన సంపుటి సృష్టి కర్త గోస్కుల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల లైబ్రరీలో భారతీయ పాశ్చాత్య శాస్త్రవేత్తలు అనే పుస్తకాలను స్వచ్ఛందంగా అందజేయడానికి ప్రయత్నం చేస్తున్నట్టు పేర్కొన్నారు. పుస్తకంలో శాస్త్రవేత్తల జీవిత చరిత్రలను, వారి వారి జీవిత సంఘర్షణలను, వారి ఆవిష్కరణలను తదితర అంశాలను పొందుపరిచినట్లు తెలిపారు. ఈ పుస్తకం ద్వారా విద్యార్థులు శాస్త్రవేత్తల జీవితాల నుంచి అనేక శాస్త్రీయ సంబంధిత విషయాలను విద్యార్థులు నేర్చుకునే అంశాలు ఉన్నాయని అన్నారు. పాఠకులలో ముఖ్యంగా విద్యార్థులలో విజ్ఞానాన్ని స్ఫూర్తిని నింపే ప్రయత్నం చేశానని అన్నారు. కార్యక్రమంలో ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శరత్ కుమార్ యాదవ్, జ్యోతి, జయశ్రీ, లక్ష్మణ్, దుస గంగన్న, పెంటపర్తి ఊశన్న, మూనాహిద్, అనుసూయ, పొచ్చిరాం పాల్గొన్నారు.

పట్టణంలో జైబాపు జైభీమ్ జైసంవిధాన్



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లా కేంద్రంలో గల మారుతి కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం జైబాపు జైభీమ్ జైసంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిర్మల్ ఇన్‌చార్జిగా నియమితులైన ఖానాపూర్ మున్సిపల్ మాజీ చైర్మెన్ రాజుర సత్యం కార్యకర్తలకు ప్రతిజ్ఞ చేయించిన అనంతరం వారు మాట్లాడుతూ భారతదేశం నేడు విపత్కర పరిస్థితులు ఎదుర్కొంటుందన్నారు. గత 10 ఏండ్లకు పైగా దేశాన్ని పాలిస్తున్న బీజేపీ భారత రాజ్యాంగాన్ని అవమానపరుస్తూ, రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ, అప్రజాస్వామ్య పాలన కొనసాగిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ మున్సిపల్ మాజీ చైర్మెన్ అప్పాల గణేష్ చక్రవర్తి, సమర సింహా రెడ్డి, గొంగోని బురజ్, కొండ శ్రీనివాస్, మహమ్మద్ అజార్, వహీద్ అహ్మద్‌ఖాన్, ఎంబడి రాజేశ్వర్, అయ్యన్నగారి పోశెట్టి, కొడుకుల శ్రీకాంత్, గాజుల రవికుమార్, నిర్మల్ జిల్లా ముఖ్య నాయకులు, అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువత సమాజానికి ఆదర్శంగా ఉండాలి



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

యువత సమాజానికి ఆదర్శంగా ఉండాలని యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దని సీఐ వెంకటేశ్వరరావు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సోషల్ మీడియా, మాదక ద్రవ్యాలపై పోలీసుల ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సోషల్ మీడియా, మాదక ద్రవ్యాల వినియోగం కరోనా వైరస్ కంటే అత్యంత భయంకరమైనదని అన్నారు. డ్రగ్స్ వినియోగం సమాజంలో అతి పెద్ద సమస్యగా మారిందని, ముఖ్యంగా యువత వాటి బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చెడు స్నేహాల వలన మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్న యువత తమ భవిష్యత్‌ను తామే నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల అమ్మకాలు, వినియోగం వంటివి గుర్తిస్తే 100 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై అప్పారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయవాదుల గుమాస్తాల సంఘం ఎన్నిక



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

న్యాయవాదుల గుమస్తాల సంఘం నూతన కమిటీని శుక్రవారం పట్టణంలోని న్యాయవాది గుమాస్తా భవనంలో ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షునిగా నోముల గణేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మామిడాల దశరథ్, ఉపాధ్యక్షునిగా గన్నోజివార్ కిషన్, కోశాధికారిగా తెడ్డోజి రాకేష్, సంయుక్త కార్యదర్శిగా మోత్కుల ఆకాష్ యాదవ్, క్రీడా కార్యదర్శిగా గోనె అనిల్ యాదవ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం వారిని సన్మానించారు. కార్యక్రమం అనంతరం నూతనంగా ఎన్నుకోబడ్డ అధ్యక్షులు నోముల గణేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిడాల దశరథ్ మాట్లాడుతూ న్యాయవాదుల గుమస్తాలకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటూ వారి అభివృద్ధి కోసం తమ సాయశక్తుల కృషి చేస్తామని తెలిపారు.

ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం

- ప్రజా ఉద్యమాలు విస్తృతంగా చేపట్టాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం నిర్వహించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని బాశెట్టి మాధవరావు విజ్ఞాన కేంద్రంలో జరిగిన పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి మాట్లాడారు. సీసీఐ పరిశ్రమ ప్రారంభించడంపై, ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ వరకు రైల్వే లైన్ మంజూరు చేయకుండా కేంద్ర ప్రభుత్వం జిల్లాకు చేస్తున్న అన్యాయంపై పోరాడాలని సూచించారు. ఇటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వేలు నిర్వహించి, సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు పోరాడాలని, కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి పని చేయాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బండారు రవికుమార్, రాష్ట్ర నాయకులు స్కైలాబ్ బాబు, శోభన్, జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లంక రాఘవులు, అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్, సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, ఆర్.సురేందర్, ఆర్.మంజుల, ఎస్.స్వామి నాయకులు జమున, శకుంతల, విష్ణు, లింగాల చిన్నన్న, ఆశన్న, స్వామి ఉన్నారు.

పోలీస్‌స్టేషన్‌లలో రిసిప్షన్ల పాత్ర కీలకం

- బాధితుల పట్ల గౌరవంగా వ్యవహరించాలి
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రతి పోలీస్ స్టేషన్‌లో రిసెప్షన్ సెంటర్‌ల పాత్ర కీలకంగా వ్యవహరిస్తుందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న రిసెప్షనిస్టులతో సమావేశం ఏర్పాటు చేసి, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం ఏర్పాటు చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ, బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా కృషి చేయాలని తెలియజేశారు. సిబ్బంది బాధితుల ఫిర్యాదులను స్వీకరించిన వెంటనే పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్ వద్ద విలేజ్ పోలీస్ ఆఫీసర్‌కు అప్పగించి సరైన దర్యాప్తును కొనసాగించి, అదేవిధంగా సంఘటనా స్థలంలో ఉన్న సాక్షుల వాంగ్మూలాన్ని నమోదు చేసి, వారి సంతకాలతో కూడిన రిపోర్టును రిసెప్షనిస్టు అందజేయాలని అన్నారు. ఒకవేళ రాజీ పొందితే రాజీ పత్రంపై ఇరు వర్గాల వారి సంతకాలు సాక్షుల సంతకాలతో కూడిన పత్రాలను నమోదు చేసుకొని ఉండాలని తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతి గ్రామంలో ఒక విలేజ్ పోలీస్ ఆఫీసర్ ఉండే విధంగా చూసుకుంటూ వారికి రిసెప్షన్ ఎంక్వైరీ ఫిర్యాదులను అందించి దర్యాప్తు నివేదికలను సరైన సమయంలో అందించే విధంగా సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. బాధితులే ఫిర్యాదును రాసే విధంగా చూసుకోవాలని తెలిపారు. ఏ గ్రామంలో కూడా పంచాయతీలు నిర్వహించకుండా పోలీసులు సరైన న్యాయం చేసే విధంగా విధులను నిర్వర్తించాలని సూచించారు. ఎంక్వయిరీ చేసిన అధికారి తన దర్యాప్తుతో పాటు సెల్ఫీతో కూడిన ఛాయాచిత్రాన్ని రిపోర్టులో పొందుపరచాలని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని తెలియజేశారు. నెలలో ప్రతి వారం సీఐ స్థాయి అధికారులు తమ పోలీస్ స్టేషన్లలో జరిగే రిసెప్షన్ వర్టికల్‌పై ప్రత్యేక చొరవ తీసుకొని సమీక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, డీసీఆర్బీ సీఐ పాండేరావు, రిసెప్షనిస్టులు సిబ్బంది పాల్గొన్నారు.

కుళ్లిపోయిన చికెన్.. పాడైపోయిన స్వీట్లు..

- అధికారుల తనిఖీల్లో వెల్లడైన డొల్లతనం



ఫ్రీజ్‌లోని కుళ్లిన మాంసాన్ని బయటకు తీసి చూస్తున్న అధికారులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణ ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించడంలో నిర్లక్ష్యం వహించే హోటళ్లు, స్వీట్ హౌజ్‌లపై కఠినంగా వ్యవహరిస్తామని సానిటరీ ఇన్స్‌పెక్టర్ నరేందర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు హోటళ్లు, స్వీట్స్ హౌజ్‌లపై దాడులు నిర్వహించారు. తినుబండాలను పరిశీలించి, హెచ్చరికలు చేస్తూ జరిమానాలు విధించారు. కలెక్టర్ చౌరస్తాలోని మామ్స్ కిచెన్ హోటల్లో తనిఖీ చేయగా కుళ్లిపోయిన చికెన్, ఫ్రీజ్‌లో పురుగులు తిరగడం గమనించి యాజమనిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మాసంతో పాటు కుళ్లిన పదార్థాలను స్వాధీనం చేసుకొని యజమానికి హెచ్చరికలు జారీ చేస్తూ జరిమానా విధించారు. అదే విధంగా వినాయక్ చౌక్‌లో వెంకటేశ్వర స్వీట్ హౌజ్‌ను తనిఖీ చేసి, పాడైన స్వీట్లను స్వాధీనం చేసుకొని జరిమానా విధించారు.

యజమానులు పరిశుభ్రత పాటించాలి...

ఈ సందర్భంగా సానిటరీ ఇన్స్‌పెక్టర్ మాట్లాడుతూ పట్టణంలోని హోటళ్లు, స్వీట్స్ హౌజ్ పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఓ హోటల్లో కిచెన్ ఆ పరిశుభ్రంగా ఉండటం, మాంసం కూడా కుళ్లిపోవడం, పదర్థాలు కూడా సక్రమంగా లేకపోవడంతో వాటిని మున్సిపల్ చెత్త వాహనంలో తరలించడం జరిగిందన్నారు. ఇక్కడ ఫ్రీజ్‌లో కూడా పురుగులు తిరుగుతున్నాయని, పదిరోజుల నుంచి ఫ్రీజ్‌లో చికెన్, ఫిష్ ఉంచడంతో దుర్గంధం వస్తుందన్నారు. అదే విధంగా ఓ స్వీట్స్ హౌజ్‌లో తనిఖీ చేశామని, ఇక్కడ పాడైన స్వీట్లను కొత్త స్వీట్లతో కలిపేందుకు సిద్ధం చేసినట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరికి జరిమానాలతో పాటు హెచ్చరికలు జారీ చేశామని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడే హోటళ్లు, స్వీట్స్ హౌజ్‌లపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అదే విధంగా వారు పరిసరాలతో పాటు కిచెన్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మరోసారి తనిఖీలో ఇలాంటివే పునరావృతం అయితే సీజ్ చేస్తామని హెచ్చరించారు.



పాడైన స్వీట్లను పరిశీలిస్తున్న అధికారులు

ముస్లింల శాంతియుత నిరసన



నవతెలంగాణ-ఖానాపూర్

వక్ఫ్ సవరణ బిల్లుకు నిరసనగా శుక్రవారం ఖానాపూర్‌లోని మదీనా మసీద్‌లో ముస్లింలు చేతికి నల్లటి బ్యాండ్ ధరించి శాంతియుతంగా నిరసనను తెలిపారు. రంజాన్ చివరి అల్విదా జుమా నాడు దేశవ్యాప్తంగా ఉన్న ముస్లింలు చేతికి నల్లటి బ్యాండ్లు ధరించాలని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపునిచ్చారు. ఈ బిల్లుపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ ఎఐఎంపీఎల్‌బీ, జుముఅతుల్ విదా నాడు మసీదుకు వచ్చే సమయంలో ముస్లింలందరూ చేతికి నల్లటి బ్యాండ్ ధరించాలని, శాంతియుతంగా, మౌనంగా నిరసన తెలపాలని కోరారు. ఈ సందర్భంగా మదీనా మసీద్ ఇమామ్ ముఫ్తి అథర్ న్యాయవాదులు షబ్బీర్ పాషా, సలీం ఖాన్ మాట్లాడుతూ ఈ బిల్లు ముస్లింల మసీదులు, ఈద్గాలు, మదర్సాలు, దర్గాలు, శ్మశానవాటికలు, ధార్మిక సంస్థలను లాక్కునేందుకు ఉద్దేశించిన కపటకుట్రగా పేర్కొన్నారు. ఈ బిల్లుని వ్యతిరేకించడం దేశంలోని ప్రతి ముస్లిం బాధ్యత అని, బీజేపీ ప్రభుత్వం ఈ బిల్లుపై వెనుకడుగు వేయకుంటే ఎఐఎంపీఎల్‌బీ పిలుపు మేరకు తమ నిరసనల, ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మసీద్ అధ్యక్షులు సయ్యద్ ఫహీం, ముస్లిం నాయకులు డా.చాంద్‌పాషా, షాకిర్ ఉల్ ఖురాన్, సయ్యద్ ఆయుబ్, హాబీబ్, షేక్ అహ్మద్, మీర్జా బేగ్, సయ్యద్ మహమూద్, షేక్ షకీల్, ఖమర్, ఖాలిక్, కలీమ్, అమిరుద్దీన్, సాబీర్, ఆఫ్రోస్ పాల్గొన్నారు.

ఉట్నూర్ : వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు 2024కు వ్యతిరేకంగా శుక్రవారం ఉట్నూర్ ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపుమేరకు ముస్లింలు నల్ల రిబ్బన్లు ధరించి శాంతియుతంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లును వెనక్కి తీసుకోవాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ భూములను ప్రయివేటు వ్యక్తులకు ఇవ్వడానికి ఈ చట్టం తేవడానికి చూస్తుందన్నారు. చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని, లేనియెడల ఆందోళను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ముస్లిం మతపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

జెండాను ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయ ఆవరణలో ఆవిష్కరించిన హీరాసుక్క జెండాను ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ప్రధాన్ సంఘం రాష్ట్ర నాయకులు దుర్వ నగేష్, ఉయిక సంజీవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం నాయకులు కేస్లాపూర్‌లోని సంఘటన స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు హీరసుక్క జెండాను తొలగించి, గోవాడ్ వెనుక ప్రదేశంలో తీసుకెళ్లి ధ్వంసం చేశారన్నారు. జరిగిన ఈ సంఘటన పోలీసులకు సమాచారం అందించడంతో ఉట్నూర్ సీఐ మొగిలి సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటన జరుగకుండా అదనపు పోలీసు బలగాలను మోహరించారు. దుండగులు ఎంతటి వారైనా పట్టుకొని చట్టరీత్య చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రధాన్ సంఘం నాయకులు దుండగులను వెంటనే పట్టుకొని కఠినంగా శిక్షించాలని స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో మెస్రం శంకర్, గేడాం భారత్, మురహారి ఉన్నారు.

తల్లిదండ్రుల పట్ల ప్రేమానురాగాలు కలిగి ఉండాలి

- మస్కాపూర్ ప్రధానోపాధ్యాయులు బి.నరేందర్‌రావు



నవతెలంగాణ-ఖానాపూర్

పిల్లలు తల్లిదండ్రులు పెద్దల పట్ల అంకితభావం కలిగి ఉండాలని మస్కాపూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోనగిరి నరేందర్‌రావు అన్నారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన మాతృ పితృ వందనం కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసిన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో అనేక అవలక్షణాలు కొనసాగుతున్నాయని వీటిని రూపుమాపుటకు ఇలాంటి కార్యక్రమాలు కొనసాగాలన్నారు. రోజు చాలా చోట్ల హింస, దోపీడీలు యదేచ్ఛగా కొనసాగుతున్నాయని అన్నారు. పిల్లల్లో మంచి అలవాట్లు పెంపొందించాలనే ఉద్దేశంతో కార్యక్రమం కొనసాగిస్తున్నామని అన్నారు. అనంతరం పిల్లలు వారి తల్లిదండ్రుల పాదాలను కడిగి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు తమ అనుభవాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రన్న, లక్ష్మణ్, ఉపేందర్, వెంకటేష్, టీచర్లు కుర్ర శేఖర్, వెన్నం అంజయ్య, జాడి శ్రీనివాస్, తొంటి శంకర్, శోభారాణి, ఇమ్రాన్, ఫరాజ్, కిషన్ ప్రసాద్, విజయ్ కుమార్, షఫీ, రవి, చందన, లక్ష్మణ్‌రావు, స్వప్న, గంగాధర్, రమేష్, సృజన, ఝాన్సీరాణి పాల్గొన్నారు.

శ్రమదానం చేసిన నవనిర్మాణ్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు



నవతెలంగాణ-బోథ్

సొనాల మండల కేంద్రానికి చెందిన నవ నిర్మాణ్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు శుక్రవారం శ్రమదానం చేశారు. సొనాల మండల కేంద్రం నుంచి బోథ్‌కు వెళ్లే రహదారి టీవీటీ, జీడిపల్లె మీదుగా వెళ్లే రహదారిలో మూల మలుపులు ప్రమాదకరంగా మారాయని అన్నారు. రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లకొమ్మలు గుబురు పొదలు పెరగటంతో ఎదురుగా వచ్చే వాహనాలు ముందుకు వచ్చే వరకు కనిపించటం లేదని, దీంతో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త ఉపాధ్యాయులు రడాపు మధుసూధన్, సొసైటీ అధ్యక్షులు కోస్మెట్ శుద్ధోధన్, సభ్యులు మునిగెల శ్రీధర్, నాగరాజు, జంగు పాల్గొన్నారు.

ప్రగల్భాలు పలుకుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అతివృష్టి, అనావృష్టితో రైతులు పంటలు నష్టపోతే వారికి ఆదుకోకుండా వారి కోసం ఇది చేశాం. అది చేశామని సీఎం రేవంత్ రెడ్డి ప్రగల్భాలు పలుకుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్ అన్నారు. శుక్రవారం కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతు సత్యాగ్రహ దీక్షను కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టారు. పక్కనే మరో ధర్నా కొనసాగుతుండటంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. రెండు ఆందోళనల మధ్య భారీకేడ్లను ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించారు. ఈ సందర్భంగా బ్రహ్మానంద్ మాట్లాడుతూ రైతులు వాతావరణ ప్రకోపంతో రైతులు పంటలు నష్టపోతే ప్రభుత్వం ఎలాంటి సాయం చేయడం లేదన్నారు. తప్పుడు హామీలతో గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయడం లేదన్నారు. హామీల అమలు చేత కాకపోతే తన పదవికి రాజీనామ చేయాలని డిమాండ్ చేశారు. రుణామాఫీ, రైతు భరోసా, రైతు బంధు రాక అనేక మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయిన కూడా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు చేసేంత వరకు బీజేపీ వారికి అండగా ఉండి పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాయల శరత్, వేదావ్యాస్, ముకుంద్, ఆస్తక్ సుభాష్, దయాకర్, ప్రఫుల్ వర్గే, స్వప్న పాల్గొన్నారు.

ఫ్లెక్సీ ప్రింటర్స్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఫ్లెక్సీ ప్రింటర్స్ జిల్లా కార్యవర్గ ఎన్నికను జిల్లా కేంద్రంలోని చత్రపతి శివాజీ భవన్‌లో శుక్రవారం నిర్వహించారు. కార్యవర్గ జిల్లా నూతన అధ్యక్షుడు శశిధర్ కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా దుక్కే స్వాగత్, ప్రధాన కార్యదర్శి గుండు శ్రావణ్ కుమార్, సంయుక్త కార్యదర్శి అశోక్, కోశాధికారిగా కట్కూరి కిరణ్ కుమార్ ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా, సామాజికంగా ముందుకు వెళ్లడానికి ప్రతి ఒక్కరి కృషి అవసరం ఉందన్నారు. ఇంకు ఇతర వస్తువుల ధరలు పెరగడం వలన ఫ్లెక్స్ ప్రింటింగ్ ఇబ్బందిగా మారిందన్నారు. యూనియన్ విడుదల చేసిన రేట్‌చాట్ ప్రకారమే ప్రింట్ చేయాలన్నారు. ఎవరైనా యజమానులు యూనియన్‌కు విరుద్ధంగా తక్కువ రేట్లకు ఫ్లెక్స్ ప్రింట్ చేస్తే రాష్ట్ర యూనియన్ ఆధ్వర్యంలో చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

వికలాంగులకు ట్రైసైకిల్ అందజేత

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి భాస్కర్ ఆధ్వర్యంలో భారత్ డైనమిక్ లిమిటెడ్ వారు నిర్వహించిన క్యాంపులో భాగంగా వికలాంగులకు స్థానిక ఎమ్మెల్యే కోవలక్ష్మి ట్రై సైకిల్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వికలాంగులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. భారత్ డైనమిక్ లిమిటెడ్ వారు ట్రై సైకిల్ అందజేయడం అభినందనీమన్నారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వెంటనే పెన్షన్ పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందులో ఆసిఫాబాద్ మండల బీఆర్ఎస్ నాయకులు, భారత్ డైనమిక్ లిమిటెడ్ సభ్యులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

వక్ఫ్ సవరణ బిల్లు - 2024కు వ్యతిరేకంగా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ముస్లిం సోదరులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జమాతే ఇస్లామీ హింద్ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ బషీరుద్దీన్, మైనార్టీ నాయకుడు జాకీర్ షరీఫ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డ్ ప్రాపర్టీనీ ప్రభుత్వం తన అధీనంలోకి తీసుకోవడానికి పార్లమెంట్లో చర్చలు జరుపుతోందన్నారు. దీనిని ముస్లిం పర్సనల్ లా బోర్డు తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ముస్లింల మసీదులు, ఈద్గాలు, మదర్సాలు, దర్గాలు, మఠాలు, శ్మశాన వాటికలు, వారి ధార్మిక సంస్థలను దూరం చేయడమే ఈ బిల్లు లక్ష్యమన్నారు. ఈ బిల్లు ఆమోదం పొందితే వందలాది మసీదులు, ఈద్-ఉల్-ఫితర్, మదర్సాలు, శ్మశాన వాటికలు, అనేక స్వచ్ఛంద సంస్థలు మన చేతుల్లో లేకుండా పోతాయని అన్నారు .అందుకే దీనిని ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. ఇందులో నాయకులు బాబా, సయ్యద్ సాదిక్ పాషా , దావూద్ అహ్మద్ సోఫీ, అబ్బు షేర్ , జాకీర్ , హాజీ , ఎజాజ్, షాకీర్ ,హౌస్ ఈద్గా కమిటీ సభ్యులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

కెరమెరి : ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని మహమ్మదీయ మసీదులో ఆవరణలో మధ్యాహ్న సమయంలో ముస్లిసోదరులు నల్ల బ్యాడ్జీల ధరించి ప్రార్థనలు నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లు 2024 పై వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డ్ ఆస్తులను ప్రభుత్వ ఆధ్వర్యంలో తీసుకోవడానికి పార్లమెంట్‌లో చర్చలు జరుగుతున్నాయని, దీనికి వక్ఫ్ తరతపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వక్ఫ్ సవరణ బిల్లు 2025 ఒక హేయమైన చర్యని పేర్కొన్నారు. ఈ సవరణ బిల్లు అంశం, స్పష్టమైన లక్ష్యం ముస్లింల మసీదులు, ఈద్గాలు, మదర్సాలు, దర్గాలు, మఠాలు, శ్మశాన వాటికలు, ధార్మిక సంస్థలను దూరం చేయడమేనని, ఇది పూర్తిగా కుట్రపూరితమన్నారు. ఇందులో మాజీ ఎంపీటీసీ ఇఫ్తేకార్ అహ్మద్, మాజీ ఉప సర్పంచ్ నిసార్ దేశ్ ముఖ్, మతీన్, పలువురు ముస్లి సోదరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : వక్ఫ్ చట్ట సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని జామ మస్జిద్ ఇమామ్ మౌలానా అయాజ్ అహ్మద్ అష్రఫీ, నాయకులు అబ్దుల్ రహమాన్ డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపుమేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని జామా మస్జిద్‌లో వక్ఫ్ చట్ట సవరణ బిల్లును కేంద్రం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నల్ల బ్యాడ్జి ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగానికి విరుద్ధంగా ఈ బిల్లు పార్లమెంట్‌లో తీసుకువచ్చిందన్నారు. వక్ఫ్ చట్ట సవరణ ద్వారా కేంద్ర వక్ఫ్ కౌన్సిల్, రాష్ట్ర వక్ఫ్ సంస్థల స్వయంప్రత్తిని దెబ్బతీస్తుందని అభిప్రాయపడ్డారు. ఇది ఒకరి మత హక్కులో జోక్యం చేసుకోవడం అవుతుందని, వక్ఫ్ బోర్డు నిర్ణయం అంతిమంగా ఉన్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ నిర్ణయించాలని చెప్పడం ప్రభుత్వం జోక్యం చేసుకోవడమే అవుతుందన్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా ఉన్న వక్ఫ్ చట్ట సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతనే జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు షబ్బీర్, ఎండి అహ్మద్, తాజ్, షాకీర్, సయ్యద్ రహమన్, ఎండి అర్షద్, ఖలీల్, నాయిమ్ ఖాన్, అబ్బు, సాలం అఖిల్ పాల్గొన్నారు.

సమస్యలను ప్రస్తావించిన ఎమ్మెల్యేకు అభినందనలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

అసెంబ్లీలో పలు సమస్యలను ప్రస్తావించి స్పీకర్ స్పీకర్ దృష్టికి ఆకర్షించిన ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబును తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అభినందించింది. నియోజకవర్గ సమస్యలే కాకుండా రాష్ట్ర సమస్యలను కూడా అసెంబ్లీలో ప్రస్తావించి వాటి పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే అభినందనీయులని అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, సభ్యులు నారాయణ, కోటేశ్వరరావు, ఆకుల నాగేశ్వర్‌రావు, చిలుక లక్ష్మీనారాయణ, నర్సయ్య, పుర్క సీతారాం పేర్కొన్నారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన రాపర్తి రవిందర్ అన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికకావడంతో న్యాయవాదులు ఆయన నివాసంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదుల ఇండ్ల స్థలాలు, ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాన్నన్నారు. ఇందులో న్యాయవాదులు రాజీవ్ రెడ్డి, మంతెన రామకృష్ణ, చంద్రకుమార్, గణపతి పాల్గొన్నారు.

భక్తుల సౌకర్యార్థం రాజురాలో బోర్‌వెల్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని రాజుర గ్రామ పోచమ్మ ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం మాజీ జెడ్పీటీసీ నాగేశ్వరరావు బోర్వెల్ వేయించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గోపాల్, శ్రీకాంత్, వసంతరావు, ప్రకాష్, మోహన్, కొండు, ఏమాజీ, రాజేందర్, విజయ్, కుసుమాకర్, శంకర్ పాల్గొన్నారు.

ఆదివాసీ బిడ్డగా పుట్టాలనుంది

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బొక్కి వెంకటయ్య
- కలెక్టర్ వెంకటేష్ దోత్రేతో కలిసి అధికారులతో సమీక్ష

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రానున్న జన్మలో ఆదివాసి కులంలో పుట్టాలని భగవంతున్ని కోరుకుంటున్నట్లు రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బొక్కి వెంకటయ్య అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అధ్యక్షతన కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీల స్థితిగతులపై అమలవుతున్న చట్టాలపై నిర్వహించిన సమావేశంలో కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణికుంట్ల ప్రవీణ్, కూసం నీలాదేవిలతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అధికారుల సమీక్ష సందర్భంగా మాట్లాడుతూ ఆదిలాబాద్‌లోని చిన్న మల్యాపూర్ గ్రామంలో ఆదివాసులతో ఒకరోజు ఉన్నానని, వారి సంస్కృతి, సాంప్రదాయాలు ఎంతగానో ఆకట్టుకున్నాయని, చిన్ననాటి గుర్తొచ్చాయన్నారు. ప్రతి విభాగాల్లో రిజర్వేషన్ల ప్రతిపాదికన పదోన్నతులు కల్పించాలని లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సివిల్ రైట్స్ డేను తహసీల్దార్, ఎస్సైల సమక్షంలో నిర్వహించాలని ఆదేశించారు. తను గతంలో 25 గురుకులాలను సందర్శించి ప్రభుత్వానికి నివేదిక పంపించానని, దీనిని ఆధారంగా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం కాస్మోటిక్ చార్జీలు పెంచిందన్నారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి 41 సీఆర్‌పీసీ కింద స్టేషన్ ఇవ్వకుండా చూడాలని సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి డీవీఎంసీ నిర్వహించాలన్నారు. విద్యాశాఖ, వైద్యశాఖ అధికారులు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు సంబంధించిన లెక్కల వివరాలు తీసుకురాకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పట్టకుండా చూడాలని సూచించారు.



వెంకటయ్యకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్

ఉపాధి హామీ పనుల్లో ఎస్సీ ఎస్టీలకు వందరోజుల పని కల్పించాలన్నారు. జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ జిల్లాలో సివిల్ రైట్స్ డే ను ప్రతి మండల కేంద్రంలో నిర్వహించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు దీనికి సంబంధించి ఏప్రిల్ నుంచి జూన్ వరకు ప్రణాళికను వెంటనే అందిస్తానని వివరించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి డీవీఎంపీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు కమిషన్ సభ్యులకు తెలిపారు. అటవీ రెవెన్యూ భూముల సమస్య ఎప్పటినుంచో ఉందని అది ఒక్క రోజులో పరిష్కారం అయ్యేది కాదని దానిని కొంత పరిష్కారం చేసే దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలల సమస్యలు పరిష్కారం దిశగా కృషి చేస్తున్నానని వివరించారు. పాఠశాలల్లో సమస్యలు తెలుసుకునేందుకు నాలుగు పాఠశాలలకు ఒక్కో అధికారి చొప్పున ఇన్‌చార్జ్‌ను నియమించడం జరిగిందని, గురుకులాల్లో తనతో పాటు అధికారులు కూడా నిద్రించడం జరుగుతుందన్నారు. ఇందులో జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల, ఏఎస్‌పీ చిత్తరంజన్, కాగజ్‌నగర్ ఎఫ్‌డీఓ సుశాంత్ సుఖదేవ్, ఆర్డీవో లోకేశ్వరరావు, డీటీడీఓ రమాదేవి, డీఆర్‌డీఓ దత్తరావు, వివిధ శాఖల అధికారులు, ఆదివాసీల నాయకులు పాల్గొన్నారు.

డ్రైవర్ల నియామకాల్లో ఆర్‌ఎంపై విచారణ జరపాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్
- డీపో ఎదుట డ్రైవర్లతో నిరసన



ఆందోళన కారులను సముదాయిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో ఆర్టీసీలో అవుట్ సోర్సింగ్ విధానంలో డ్రైవర్ల నియామకాలకు సంబంధించి అక్రమాలకు పాల్పడ్డ ఆర్‌ఎం పై విచారణ జరపాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ డిమాండ్ చేశారు. అద్దె బస్సు డ్రైవర్లతో కలిసి డిపో ఎదుట రెండు గంటల పాటు బైఠాయించగా బస్సులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఎస్సై ప్రశాంత్ ఆధ్వర్యంలో పోలీసులు అక్కడికి చేరుకొని వారింపచేసే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో అవుట్ సోర్సింగ్ విధానంలో డ్రైవర్ల నియామకం కోసం నోటిఫికేషన్ ఇచ్చారని, అయితే జిల్లా నుండి 250 మందికి పైగా దరఖాస్తు చేసుకోగా ఎటువంటి సమాచారం లేకుండా ఈ నెల 26న భర్తీ ప్రక్రియ పూర్తి చేయడం దారుణమన్నారు. ఆసిఫాబాద్ డిపోలో పనిచేస్తున్న అనేక మంది అద్దె బస్సు డ్రైవర్లు దరఖాస్తు చేసుకున్నారని వారిలో ఎవరిని నీకు కూడా తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. దీనికి ఆర్టీసీ పీఓ కూడా సహకారం అందిస్తున్నాడని ఆరోపించారు. ఆర్టీసీ ఆర్‌ఎం, పీఓలపై విచారణ జరిపి అద్దె బస్సు డ్రైవర్లకు న్యాయం చేయాలని లేదంటే ఈ నెల 5 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు హెచ్చరించారు. అనంతరం డిపో మేనేజర్ రాజశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ఇందులో ప్రైవేట్ అద్దె బస్సు డ్రైవర్స్ యూనియన్ ఆసిఫాబాద్ డిపో అధ్యక్షుడు మధుసూదన్, ప్రధాన కార్యదర్శి షఫీక్, వర్కింగ్ ప్రెసిడెంట్ బాలేష్ కుమార్, ఉపాధ్యక్షుడు భాస్కర్, డ్రైవర్స్ తిరుపతి, శోభన్, విజయ్, కుమార్, సాయి, నగేష్, ఇమామ్, హైమద్, నవీన్, గోపాల్, భీంరావు, అంజి పాల్గొన్నారు.

టవర్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

- జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ నెట్వర్క్ టవర్ల నిర్మాణాల కొరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావు, కాగజ్ నగర్ ఎఫ్‌డీఓ సుశాంత్ బొగాడే, బీఎస్ఎన్ఎల్ నిజామాబాద్ సర్కిల్ జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ జనరల్ మేనేజర్ జగ్రామ్‌లతో కలిసి నెట్‌వర్క్ టవర్ల నిర్మాణాలపై శాఖ అధికారులు, తహసీల్దార్లు, అటవీ రేంజ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మంజూరైన 9 టవర్‌లలో 8 టవర్‌ల నిర్మాణాలకు ఎలాంటి ఆటంకాలు లేనందున ప్రతిపాదనలు సిద్ధం చేసి అనుమతులు పొంది వెంటనే నిర్మాణం పూర్తి చేయాలన్నారు. కెరమెరి మండలంలోని పరందోలిలో ఏర్పాటు చేసే టవర్‌కు రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించాలని, జిల్లాకు అదనంగా 16 టవర్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఈ టవర్ల ఏర్పాటుకు అనువైన స్థలాలను



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఎంపిక చేసి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందులో తహసీల్దార్లు కిరణ్, దత్తు ప్రసాద్, అటవీ రేంజ్ అధికారులు, బీఎస్ఎన్ఎల్ ఇంజినీర్‌లు పాల్గొన్నారు.

నేరాల తగ్గుదలకు కృషి చేయాలి

- ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎస్పీ

ఆసిఫాబాద్ : నేర రహిత సమాజం ఉన్నప్పుడు ప్రజలు ప్రశాంతంగా ఉండగలుగుతారని నేరాల తగ్గుదలపై పోలీసులు కృషి చేయాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో అన్ని పోలీస్ స్టేషన్‌ల అధికారులతో నెలవారి నేరసమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోక్సో, రేప్ కేసుల్లో త్వరితగతిన ఇన్‌వెస్టిగేషన్ పూర్తి చేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు గంజాయి, జూదం, పీడీఎస్ బియ్యం, పశువుల అక్రమ రవాణా లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి, పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో పోలీసుల సేవల గురించి ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు, ప్రతి విషయాన్ని పోలీసులు దృష్టికి తెచ్చేలా ప్రజలను ప్రేరేపించాలన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన 15మంది పోలీస్ సిబ్బందికి ప్రశంస పత్రాలు అందజేశారు. ఇందులో అదనపు ఎస్పీ ఆర్.ప్రభాకర రావు, ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్, డీఎస్పీలు కరుణాకర్, రామానుజం, రమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గోండ్వానా ఫౌండేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కెరమెరి

కొమురం భీమ్ జిల్లా గోండ్వానా రాయ్‌సెంటర్ సార్మేడి కుర్సెంగ మోతిరాం ఆధ్వర్యంలో ఉగాది పండుగని పురస్కరించుకుని శుక్రవారం గోండ్వానా ఫౌండేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలేజీలో ఫీజు కట్టలేని నిరుపేద ఆదివాసీ విద్యార్థులకు ఫౌండేషన్ ద్వారా ఆర్థికసాయం అందిస్తున్నామన్నారు. భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలు చేపడతామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివాసి సంస్కృతి, సాంప్రదాయాలని భావితరాలకు అందించేందుకు ఫౌండేషన్ ద్వారా కృషి చేస్తున్నామన్నారు. ఫౌండేషన్ చైర్మన్ సిడాం తిరుపతి మాట్లాడుతూ ఆదివాసులు చదువు పై శ్రద్ధ చూపాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను బాధ్యతగా చదివించాలన్నారు. చదువులో రాణించినప్పుడే పిల్లల భవిష్యత్తు బాగుంటుందన్నారు. ఈ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న గోండ్వానా నాయకులు

కార్యక్రమంలో రాయ్ సెంటర్ జిల్లా నాయకుడు నరసింగరావు, ఆసిఫాబాద్ డివిజన్ అధ్యక్షుడు ఆత్రం రఘు, రాయ్ సెంటర్ ఉపసార్మేడి టేకమ్ గంగారాం, సుర్పం మారు, వివిధ గ్రామాల రాయ్ సెంటర్ నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం నిల్వల్లో జాగ్రత్తలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పంట కోతల అనంతరం ధాన్యం నిల్వల్లో జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్ర గిడ్డంగుల సంస్థ (సీడబ్ల్యూసీ) ఆదిలాబాద్ మేనేజర్ వరికుంట రవికుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రైతు వేదికలో రెండు రోజులపాటు కొనసాగిన రైతులకు అవగాహన సదస్సు ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతూ రైతులందరూ సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. నిల్వచేసిన ధాన్యాలను ఎలుకలు ఉడతలు, లక్కపురుగులు వివిధ క్రిమి కీటకాలను నివారించే పద్ధతులను రైతులు పాటించాలన్నారు. అప్పుడే నష్టాల నుంచి బయటపడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. స్థానిక ఎస్‌డబ్ల్యూసీ గోదాం వద్దకు రైతులను తీసుకెళ్లి నిల్వ పద్ధతులను క్షుణ్ణంగా వివరించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హాజరైన రైతులందరికీ కిలో చొప్పున ఎరువు, ఒక క్వింటాల్ సామర్థ్యం గల లోహపు డబ్బా పంపిణీ చేశారు. ఇందులో వ్యవసాయ శాఖ అధికారి మిలింద్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్ విజయేందర్ రెడ్డి, ఏఈవోలు చిరంజీవి, రాము, దమ్మదాస్, సీడబ్ల్యూసీ ఆదిలాబాద్ సూపరిండెంటెండ్ గౌతమ్, సిబ్బంది సాయి, ఫణీంద్ర, ఎగ్జిక్యూటివ్ టెక్నికల్ అధికారి శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

బీసీల పోరు గర్జన పోస్టర్ విడుదల



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రాల్లోని బీసీ సంక్షేమ సంఘ భవనంలో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రూప్నర్ రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం బీసీల పోరుగర్జన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రధాని మోడీ దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని, రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ 42 శాతానికి పెంచుతూ అసెంబ్లీలో చేసిన చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు సమావేశాలలో ప్రవేశపెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ లు ఎవరు ఇచ్చే భిక్ష కాదని, ఇది బీసీల సామాజిక హక్కు అని అన్నారు. బీసీ రిజర్వేషన్ అమలుకై ఏప్రిల్ 2న ఢిల్లీలో పోరుగర్జన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బీసీ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఇందులో బీసీ సంక్షేమ సంఘం విద్యార్థి జిల్లా అధ్యక్షుడు లోబడే లహు కుమార్, బీసీ రైతు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వైరగడే మారుతి పటేల్, అఖిలభారత మాలీమహా సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగోసె శంకర్, బీసీ సంక్షేమ సంఘ నాయకులు ఎసయ్య, శెండే రాజు పటేల్ పాల్గొన్నారు.

ఇద్దరమ్మాయిలతో యువకుడి పెండ్లి

- సోషల్ మీడియాలో వైరల్



నవతెలంగాణ-జైనూర్

ఒకే మండపంలో ఇద్దరమ్మాయిలను ఓ యువకుడు పెండ్లి చేసుకున్న ఆసక్తికర సంఘటన లింగాపూర్ మండలం గుమ్నూర్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే గుమ్నూర్ గ్రామానికి చెందిన సూర్యదేవ్ అనే యువకుడు లాల్‌దేవీ, జలకర్ దేవీ అనే ఇద్దరమ్మాయిలను ప్రేమించి, వారి సమ్మతితో ఒకే మండపంలో వారిద్దరిని వివాహమాడాడు. మూడు గ్రామాల ప్రజలు ఈ వివాహానికి హాజరై నవ జంటలకు ఆశీస్సులు అందజేశారు. గ్రామస్తులే కాకుండా మండల ప్రజలు ఈ వినూత్న వివాహాన్ని చూసి ఆశ్చర్యపోక తప్పలేదు. ప్రస్తుతం ఈ అరుదైన వివాహం మండలంలోనే కాకుండా, సోషల్ మీడియాలోనూ చర్చనీయాంశంగా మారింది.

నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



పోలీసులు నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సీనియర్ సివిల్ జడ్జ్ యువరాజ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డీవీ శ్రీనివాసరావుతో కలిసి పోలీస్ అధికారులకు నూతన చట్టాలు ఇతర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే అమలు సాధ్యమవుతుందన్నారు. రోడ్డు ప్రమాద కేసులలో కేసులలో బాధితులకు త్వరితగతిన నష్టపరిహారం వచ్చేలా చూడాలని అన్నారు. కేసుల పరిష్కారం కోసం పోలీస్ అధికారులు బాధితులు లోక్‌అదాలత్ వినియోగించుకోవడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే ఒరవడి కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రభాకర రావు, ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్, డీఎస్పీలు కరుణాకర్, రామానుజం, రమేష్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

మైనారిటీలకు రంజాన్ తోఫాల పంపిణీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రంజాన్ పండగను పురస్కరించుకొని శుక్రవారం వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వరావు మైనారిటీలకు రంజాన్ తోఫాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ అన్ని వర్గాల ప్రజలు తమ పండగలను ఘనంగా జరుపుకోవాలనే ఉద్దేశంతోనే చర్యలు తీసుకుంటున్నారన్నారు. మైనారిటీలు రంజాన్ పండగను ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ రంజాన్ తోఫాలను పంపిణీ చేశారు. గత 30 ఏండ్లుగా ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేస్తుండగా ఈ ఏడాది నేరుగా రంజాన్ తోఫాలను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో మాజీ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ అలీబీన్ అహమద్, జిల్లా నాయకులు కొట్నాక విజయ్, కాంద్రే విశాల్, పార్టీ మండల అధ్యక్షులు సుంకరి పెంటయ్య, నాయకులు ముషీర్, నజీర్, అలీ, సంతోష్ యాదవ్, శ్రీశైలం యాదవ్, రిటైర్డ్ ఎస్ఐ వెంకన్న, నాసర్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

నవతెలంగాణ-తాండూర్



మండలంలోని సురభి మినీ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం 2014-15 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులు అపూర్వ సమ్మేళన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యా భారతి పాఠశాల కరస్పాండెంట్ సురభి ఆగమరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 10 సంవత్సరాల తర్వాత అపూర్వ సమ్మేళన కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు విద్యార్థులందరూ ఒకే చోట కలుసుకొని సంతోషంగా గడిపారు. విద్యా భారతి పాఠశాలలో బోధించిన ఉపాధ్యాయులను పూలమాలలు శాలువాలతో ఘనంగా సత్కరించారు.

ఘనంగా ఎడ్లబండ్ల పోటీలు

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని ముత్యంపల్లి శివారులో ఎడ్ల బండ్ల పోటీలను ఘనంగా నిర్వహించారు. ముత్యంపల్లి శివారు పెద్ద ధర్మారం నుంచి గురువాపూర్ గ్రామాల మద్య పుట్ట శేఖర్ ఆధ్వర్యంలో ఎడ్ల బండి పోటీలు చేపట్టారు. ఈ పోటీలను కాసిపేట మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ హాజరై ప్రారంభించారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి చిన్న వెంకటాపూర్‌కు చెందిన గెల్ల గణపతి, ద్వితీయ బహుమతి మందమర్రికి చెందిన రెడ్డి అభయదేవా, తృతీయ బహుమతి ముత్యంపల్లికి చెందిన పుట్ట శేకర్ గెలుపొందారు. ఈ బహుమతులను మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రౌత్ సత్తయ్య, ప్రధాన కార్యదర్శి మైదం రమేశ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోలేటి స్వామి, నాయకులు చంద్రమోళి, రైతులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ మంచినీటిపై అవగాహన



నవతెలంగాణ-తాండూర్

ప్రజలు మిషన్ భగీరథ ద్వారా అందించే పరిశుభ్రమైన నీటిని తాగాలని మిషన్ భగీరథ డివిజనల్ ఇంజనీర్ ప్రవీణ్ తెలిపారు. శుక్రవారం భీమిని మండలంలోని మామిడిగూడ గ్రామస్తులు చెలమల నీళ్లు తాగుతున్నారన్న విషయాన్ని తెలుసుకొన్న అధికారులు మిషన్ భగీరథ మంచినీటిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చెన్నూరు ల్యాబ్ ఆపరేటర్ సిబ్బందితో మిషన్ భగీరథ చెలిమ నీటిని పరీక్షించి తేడాను గ్రామస్తులకు వివరించారు. మిషన్ భగీరథ ద్వారా అందించే పరిశుభ్రమైన నీరు ఆరోగ్యాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. ప్రజలు బహిరంగ ప్రదేశాలలోని ఊట బావులు చెలిమలు కుంటల్లోని నీరు తాగడం వల్ల అనారోగ్యాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. మిషన్ భగీరథ నీటిలోని మినరల్స్ లవణ శాతాలను తాగడం వల్ల జరిగే మేలును ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్, ఇంజనీర్లు పోశం శ్రీనివాస్, చెన్నూరు ల్యాబ్ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అగ్గి తెగులు నివారణ చర్యలు చేపట్టండి

● భీమారం వ్యవసాయ అధికారి అత్తే సుధాకర్



నవతెలంగాణ-జైపూర్

భీమారం మండలం ఆర్కెపల్లి శివారులో సాగు చేసిన వరి పంట క్షేత్రాలను సంధర్శించిన వ్యవసాయ అధికారి అత్తే సుధాకర్ వరి పైరులో అగ్గి తెగులు గుర్తించినట్లు తెలిపారు. ఆర్కెపల్లి శివారు వరి పంట క్షేత్రాలను శుక్రవారం సంధర్శించిన ఆయన స్థానిక రైతులతో మాట్లాడారు. వరి పైరును ఆశించిన అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లాజోల్‌తో మ్యాంకోజెబ్ 500 గ్రాములు ఎకరానికి పిచికారి చేయడం ద్వారా అగ్గి తెగులు సమగ్రవంతంగా నివారించవచ్చని తెలిపారు. అదేవిధంగా సాగు నీటి సమస్యతో పంట పొలాలు ఎండిపోతున్నట్లు తెలిపారు. వరి పైరు ఎదుగుదలకు అవసరమైన నీరు నిలువగా ఉండాలని రైతులు ఈ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారితో పాటు వ్యవసాయ విస్తరణ అధికారి బొల్లం అరుణ్ కుమార్, ఆర్కెపల్లి శివారు రైతులు సందెల తిరుపతి ఉన్నారు.

తలసేమియా అవగాహనా సదస్సులు నిర్వహించాలి

నవతెలంగాణ-మందమర్రి

ప్రపంచ తలసేమియా దినం మే 8న ప్రభుత్వం అధికారికంగా అవగాహన సదస్సులు నిర్వహించాలని కాసర్ల శ్రీనివాస్ తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తల సేమియా సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులు రోజురోజుకి పెరిగిపోతున్నారని ఆవేదనని వ్యక్తం చేశారు. ప్రతి వంద మందిలో ఐదుగురు తల సేమియా సికిల్ సెల్ వ్యాధి గ్రస్తులు ఉన్నారని తెలిపారు. ఈ వాహకాలు పెళ్లి చేసుకుంటే పుట్టబోయే సంతానం 50 శాతం నార్మల్ పిల్లలు 25 శాతం వ్యాధి వాహకాలు 25 శాతం వ్యాధిగ్రస్తులు జన్మిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వ్యాధిగ్రస్తులు ప్రతి సంవత్సరం 500 నుండి 600 మంది జన్మిస్తున్నారన్నారు. వ్యాధిని అరికట్టడానికి ప్రభుత్వం పెళ్లికి ముందు యువతి యువకులకు విద్యార్థిని విద్యార్థులకు హెచ్‌బీఏ 2 వైద్య పరీక్షలు అలాగే ప్రతి గర్భిణీ స్త్రీకి కూడా హెచ్‌బీఏ 2 రక్త పరీక్షలు నిర్వహించాలని కోరారు. ప్రభుత్వమే రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఏర్పాటు చేసినట్లుగానే తల సేమియా సికిల్ సెల్ కంట్రోల్ సొసైటీని ఏర్పాటు చేసి వ్యాధిని అరికట్టేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రపంచ తలసేమియా దినాన్ని పురస్కరించుకొని స్వచ్ఛంద సంస్థలు కూడా అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్ల పట్టివేత



నవతెలంగాణ-జన్నారం

కవ్వాల్ టైగర్ జోన్ అటవీ డివిజన్ పరిధిలోని ఇందన్‌పల్లి రేంజ్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎఫ్ఆర్ఓ కారం శ్రీనివాస్ తెలిపారు. పట్టణానికి చెందిన దాసరి అన్వేష్, దస్తురాబాద్ మండల్ బుట్టాపూర్ గ్రామానికి చెందిన తిప్పని విశ్వాస్, కలమడుగు గ్రామానికి చెందిన పిండి ముజ్జన్నకు చెందిన మూడు ట్రాక్టర్లను పట్టుకొని ఇందంపల్లి అటవీ రేంజ్ కార్యాలయానికి తరలించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఇసుక అవసరం ఉంటే ముందుగా రేంజ్ కార్యాలయంలో, గాని తహసీల్దార్‌ను గాని సంప్రదించాలని సూచించారు.

గుడుంబా అమ్ముతూ పట్టుబడిన వ్యక్తి బైండోవర్

నవతెలంగాణ-మందమర్రి

గుడుంబా అమ్ముతూ పట్టుబడిన వ్యక్తిని తహసీల్దార్ ఎదుట పోలీసులు బైండోవర్ చేశారు. దొర్ల బంగ్లా ప్రాంతానికి చెందిన మానుపాటి సంపత్ గుడుంబా అమ్ముతున్నట్లు శుక్రవారం పోలీసులకు సమాచారం రావడంతో ఎఎస్ఐ మాజీద్ సిబ్బందితో కలిసి తనిఖీ చేయగా 2 లీటర్ల గుడుంబా లభించింది. గుడుంబాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు అదనపు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. సంపత్ భవిష్యత్తులో ఎలాంటి నేరం చేయకుండా తహసీల్దార్ సతీష్ ఎదుట బైండ్ ఓవర్ చేశారు.

హాస్టల్ వర్కర్స్‌కు వేతనాలు పెంచాలి

నవతెలంగాణ-మంచిర్యాల



కార్యక్రమంలో మాట్లాడుతున్న సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మానందం

జిల్లాలో పని చేస్తున్న పోస్ట్ మెట్రిక్ హాస్టల్ వర్కర్స్ వేతనాలు పెంచాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మానందం డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ దళిత అభివృద్ధి శాఖ పోస్ట్ మెట్రిక్ హాస్టల్ వర్కర్స్‌కు కనీస వేతనాలు చెల్లించాలన్నారు. అన్ని శాఖలలో విధులు నిర్వహిస్తున్న, అవుట్‌సోర్సింగ్ వర్కర్స్‌కు కనీస వేతనాలు జీఓ నెంబర్ ప్రకారం చెలిస్తున్నారని, కాని దళిత అభివృద్ధి శాఖ పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌లో పనిచేసే డే వాచ్మెన్, నైట్ వాచ్మెన్, కుక్, అసిస్టెంట్ కుక్, స్వీపర్ అండ్ స్కావెంజర్స్‌కు అతి తక్కువ వేతనాలు అందిస్తూ పరిమితికి మించిన పని చేయుంచుకుంటున్నారని తెలిపారు. నెలలో ఒక్కరోజు కూడా సెలవు లేకుండా విధులు నిర్వహిస్తున్న ఈ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించడంలో ఈఎస్ఐ, ఈపీఎఫ్ అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా పోస్ట్ మెట్రిక్ హాస్టల్ వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షాన భారత కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేశామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అనంతగిరి సుజాత, సదానందం, ప్రసాద్, జనార్ధన్, ఎల్లబెల్లి రాజేశ్వరి, తోకల లక్ష్మీ, అనసూర్య, అనిత, సునీత, కనుక లక్ష్మి, అంజలి, లక్ష్మి, స్వప్న, లావణ్య, మల్లేశ్వరి, హేమలత, దుర్గ, జ్యోతి, తిరుమల, రమ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

నవతెలంగాణ-జైపూర్



ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అధికారులు

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే ఎంతటి వారైనా సహించేది లేదని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంచిర్యాల డీసీపీ భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, స్థానిక తహసీల్దార్ రాఘవేంద్రతో కలిసి శుక్రవారం కోటపల్లి మండలం కొల్లూరు, ఎర్రాయిపేట్ ఇసుక రీజ్ పాయింట్లను సంధర్శించారు. ప్రభుత్వం తక్కువ ధరతో నేరుగా వినియోగదారునికి ఇసుక రవాణా చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో ఎవరైన ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. ప్రస్తుతం ఒక లోడర్ పని చేస్తుందని, కూలీల సంఖ్య తక్కువగా ఉండటంతో నిర్దేషిత లక్ష్యానికి అనుగుణంగా ఇసుకు సరఫరా జరుగడం లేదని తెలిపారు. అదనంగా లోడర్‌ను అందించేందకు సిద్దంగా ఉన్నామని తెలిపారు. ప్రతి రోజు కనీసం 200 లారీలకు తగ్గకుండా ఇసుక తరలించాలని సూచించారు. అదే సమయంలో ఇసుక తరలించే లారీలతో రహదారుల మీదుగా ప్రయాణించే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా జాగ్రత్తపడాలని తెలిపారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సంధర్శించిన కలెక్టర్ అందుబాటులో గల రికార్డులను పరిశీలించారు. అధికారులు విధుల పట్ల సమయపాలన పాటించాలని సూచించారు. వివిధ రకాలైన ధ్రువపత్రాల కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి నిబంధనల మేరకు నిర్ణీత గడువుతో అందజేయాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండల కేంద్రంతో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంధర్శించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి లక్ష్మయ్య, చెన్నూర్ సీఐ సుధాకర్, ఉప తహసీల్దార్ నవీన్, పంచాయతీ కార్యదర్శి బొల్లం సందీప్ పాల్గొన్నారు.

తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

● జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-జైపూర్



నర్సరీని పరిశీలిస్తున్న డీపీఓ వెంకటేశ్వర్లు

ఎండలు తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో తాగు నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం ఇందారం గ్రామ పంచాయతీని ఆకస్మికంగా సంధర్శించిన ఆయన గ్రామ పంచాయతీ రికార్డులు పరిశీలించారు. రికార్డులు ఎప్పటికప్పుడు పూర్తి స్థాయి సమాచారంతో ఉండాలని తెలిపారు. వాటర్ అండ్ శానిటేషన్‌కు సంబంధించిన ఏడు రిజిస్టర్లు పరిశీలించిన ఆయన గ్రామ పంచాయతీ పరిధిలో కొనసాగుతున్న పారిశుధ్య పనులు పరిశీలించారు. తడిపొడి చెత్త వేరు వేరుగా సేకరించాలని, గ్రామ పంచాయతీ పరిధిలో ప్లాస్టిక్ కవర్లు ఇతర వ్యర్థాలు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని హెచ్చరించారు. సెగ్రిగేషన్ షెడ్‌లో తయారైన కాంపోస్టు ఎరువు మొక్కలకు వినియోగించుకోవాలని, నర్సరీలో మొక్కలు వంద శాతం జర్మనేషన్ వచ్చే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్, ఇందారం గ్రామ పంచాయతీ కార్యదర్శి సుమన్, ఫీల్డ్ అసిస్టెంట్ సుదర్శన్ పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండుగలు నిర్వహించాలి

● మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్



నవతెలంగాణ-మంచిర్యాల

ప్రశాంత వాతావరణంలో ఉగాది, రంజాన్ పండుగలు నిర్వహించాలని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. షబ్ ఎ ఖద్ర్-జాగ్ నేకి రాత్ సందర్భంగా పట్టణం లో ఎలాంటి శాంతి భద్రతలు తలెత్తకుండా ఉండాలన్నారు. గురువారం రాత్రి పట్టణంలోని పలు ప్రాంతాలను ఆకస్మికంగా సందర్శించి ముస్లిం సోదరులతో మాట్లాడి ప్రశాంతమైన వాతావరణంలో పండగలను జరుపుకోవాలని, ఒకరిని ఒకరు గౌరవించుకోవాలని, మత సామరస్యాన్ని చాటాలని డీసీపీ సూచించారు. అనంతరం మంచిర్యాల రైల్వే స్టేషన్, పట్టణంలోని పలు ప్రాంతాలను సందర్శించి విధి నిర్వాహణలో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, శాంతి భద్రతల సమస్యలు తలెత్తడానికి ఏవైనా అవకాశం ఉంటే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఎవరైన శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేదిలేదని, అట్టి వ్యక్తులపై చట్టరిత్య కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జాతీయ విపత్తు నిర్వహణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నవతెలంగాణ-జన్నారం

రానున్న వేసవికాలం దృష్ట్యా కిష్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో జాతీయ విపత్తు నిర్వహణపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ డి.శ్రీనివాస్ మాట్లాడుతూ వివిధ రకాల విపత్తులలో జరిగే ప్రమాదాలను గురించి వివరించారు. రానున్నది వేసవి కాలం ఈ కాలంలో అధిక అగ్ని ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉన్నందున వీటిని ఎలా ఎదుర్కొనాలో చెప్పే ఉదేశ్యంతో ప్రమాదాల నుంచి ఎలా ప్రాణ, ఆస్తి నష్టాల నుండి బయటపడాలో మెలకువలు చెప్పారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది ప్రదర్శించిన విన్యాసాలు చూసి విద్యార్థులు విపత్తుల నుండి ఏ విధంగా తమకు తాము లేదా ఇతరులను రక్షించాలో తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు దాముక కమలాకర్, అగ్నిమాపక సిబ్బంది శివకుమార్, ఉదయ్ కిరణ్, ప్రశాంత్, శ్రీనివాస్, రమేష్, ఉపాధ్యాయులు గోవర్ధన్ చారి, రాజన్న, బుచ్చి లింగయ్య, ప్రకాష్ బానావత్, జ్యోతిశీల మణెమ్మ, నరహరి శర్మ, శ్రీనివాస్, రజితారాణి, కాంతయ్య శ్రీనివాస్, అజీమ్, సుస్మిత, స్వప్న పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని గౌరవిద్దాం

నవతెలంగాణ-లక్షెట్టిపేట

భారతదేశంలో మహాత్మా గాంధీ, అంబేద్కర్ రాజ్యాంగాన్ని గౌరవించి అమలుపరచుకుందామని కాంగ్రెస్ నాయకులు అన్నారు. శుక్రవారం జై బాపు, జై భీమ్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని గురునానక్, ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయులమైన మేము మా రాజ్యాంగాన్ని అత్యంత పవిత్రమైనదిగా భావించాలని అన్నారు. డా. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను అమలు చేస్తూ మన గొప్ప రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి చిత్త శుద్దితో, అంకిత భావంతో అహర్నిశలు కృషి చేద్దాం అని ప్రతిజ్ఞ చేస్తే, మహాత్మా గాంధీ, బాబా సాహెబ్ అంబేద్కర్‌ల ఆశయాలను కొనసాగిచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పూర్ణచెందర్, చింత అశోక్ కుమార్, మండల



మున్సిపాలిటీ అధ్యక్షుడు పింగళి రమేష్, ఎండీ ఆరిఫ్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, ఆర్టీఏ మెంబర్ అంకతి శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నలిమేలా రాజు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ ఏర్పాటు అభినందనీయం



నవతెలంగాణ-లక్షెట్టిపేట

ఎండలు మండిపోతున్నందున ప్రయాణికుల సౌకర్యార్థం తాత్కాలిక బస్ షెల్టర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు తొగరు రాజు అన్నారు. శుక్రవారం పట్టణంలో మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్ షెల్టర్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రయాణికులు బాధలు అర్థం చేసుకొని బస్ షెల్టర్లు ఏర్పాటు చేసిన మున్సిపల్ కమిషనర్, మేనేజర్, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మాలెం చిన్నన్న, మండల ఉపాధ్యక్షుడు ఖైరం లింగన్న, పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లంపల్లి రమేష్, బొల్లెద్ల విజయ్, చాతరాజు రాజేష్, అలుగునూరి నరేష్, కండె మొగిలి, అసాది చిన్నన్న, తోగరు బాపు, అడ్లూరి శివ, సునీల్, పెండెం రాజశేఖర్, అసాది సురేష్, పాపన్న పాల్గొన్నారు.

నిరుద్యోగ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



నవతెలంగాణ-మంచిర్యాల

తెలంగాణలోని నిరుద్యోగ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ నిరుద్యోగ కళాకారుల యాక్షన్ కమిటీ రాష్ట్ర సభ్యుడు శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నిరుద్యోగ కళాకారులకు ఉద్యోగాలు కల్పించి వారిని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని అసెంబ్లీలో మాట్లాడిన సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌కు ధన్యవాదలు తెలిపారు. అట, పాటలతో తెలంగాణ ఉద్యమాన్ని తీవ్రతరం చేసిన తమను బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తమను గుర్తించి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నా నిరుద్యోగ కళాకారులకు సంస్కృతిక సారధిలో ఉద్యోగాలిచ్చి ఆదుకోవాలని కోరారు. లేని పక్షన తెలంగాణ వ్యాప్తంగా ఉద్యమాలు-ధర్నాలు-రాస్తా రోకోలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కళాకారులు మహంకాళి శారద, రొయ్యల లింగన్న, ఆవునూరి సత్యం, గూడ రాజేందర్, కొల్లూరి మహేష్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో అమ్మా నాన్నకు చదువుపై అవగాహన



నవతెలంగాణ-కాసిపేట

మండలంలో వంద రోజుల్లో వంద శాతం అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అమ్మా నాన్నకు చదువు అనే అంశంపై కాసిపేట జిల్లా పరిషత్ పాఠశాల, లంబాడీతండా(ఎస్) పాఠశాల, తెలంగాణ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. నిరక్షరాసులైన అమ్మానాన్నలకు చదువు నేర్పించే విధానంపై వయోజన విద్యాశాఖ డీఆర్పీలు బండ శాంకరి, సుమన్, కె అశోక్ రావులు వివరించారు. ఈ సంధర్భంగా విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు చదువు నేర్పడం ఎంత అవసరమో వారికి అవగాహన కల్పించారు. విద్యార్థులకు వాచకాలను పంపిణీ చేసి వాచకం ద్వారా చదువును సులభంగా అక్షరాలు ఎలా చెప్పాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ చైతన్య స్కూల్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

నవతెలంగాణ-మందమర్రి

శ్రీ చైతన్య స్కూల్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకలో ప్రాథమిక విద్యను పూర్తి చేసి ఆరవ తరగతిలో అడుగుపెడుతున్న విద్యార్థులు ఆనందంగా పాల్గొన్నారు. విద్యార్థులు మాట్లాడుతూ చిన్నతనంలో చిరస్మరణీయమైన మధురానుభూతి అని, మార్గదర్శకులుగా నిలిచిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. మిడిల్ స్కూల్‌లో కొత్త అవకాశాలను ఎదుర్కోడానికి నేర్చుకోదానికి ఉత్సాహంగా ఉన్నామని తమ మనోభావాలు వెల్లడించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్ మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ డే అనేది విద్యార్థుల జీవితంలో మరొక ముందడుగు అన్నారు. ఆరవ తరగతిలో విద్యార్థులు మరింత పట్టుదలతో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపగా, విద్యార్థుల గ్రూప్ ఫోటోలు వేడుకకు మరింత శోభని ఉత్సాహాన్ని తీసుకువచ్చాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకుల ఇన్‌చారి సునీత, శ్వేత, భవిత, సుజాత, అంజుమ్, స్రవంతి, స్వప్న, లయ పాల్గొన్నారు.



డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో తాగునీటి ఎద్దడి

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణంలోని కుమురం భీమ్ చౌరస్తాలో నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని కాలనీవాసులు విజయ, షకీల్, గంగన్న, కలీం, చాంద్, అఖిల్, హనుమంతు, అజీమ్, రాము, చంద్రకళ, రాజు, గోవిందమ్మ, రజితలు తెలిపారు. శుక్రవారం



కాలనీలో నీళ్లు లేకపోవడంతో బిందెలతో రహదారిపై ఉన్న చేతిపంపు వద్దకు వచ్చి లైన్లో బిందెలు పెట్టుకున్నారు. నీటి వసతి కల్పించి తమ కష్టాలు తీర్చాలని వేడుకున్నారు. వసతులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తమకు నీటి సమస్య తీర్చాలని కోరారు.

30 సంవత్సరాల పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ

నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండల కేంద్రంలోని కుమురంభీం చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి, దర్శనాల పోచ్చన్న ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ విజయోత్సవాల్లో భాగంగా, మంద కృష్ణకు పాలాభిషేకం, ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కూడల స్వామి పాల్గొని మాట్లాడుతూ మూడు దశాబ్దాల పోరాటం విజయం సాధించామంటే అది కేవలం మంద కృష్ణ పటిష్టమైన పోరాట ఫలితమేనని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్, మండల ఇన్‌చార్జి, దర్శనాల పోచ్చన్న, అశోక్, అశన్న, ముక్కెర ప్రభాకర్, పెంటపర్తి శ్రీనివాస్, తోట గౌతమ్, పెంటపర్తి నవీన్, అశన్న పాల్గొన్నారు.



సమాజంలో మతాల కన్నా మానవత్వమే ముఖ్యం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమాజంలో మతాల కన్నా మానవత్వమే ముఖ్యమని, అందరూ సమానమేనన్న భావన రావాలనే ఉద్దేశంతో రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలకు సరకులను పంపిణీ చేస్తున్నామని సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని కేఆర్కే కాలనీలో 200 మంది పేద ముస్లిం కుటుంబాలకు నిత్యాసరకులను అందించారు. పండుగలను ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో జరుపుకోవాలని, అందరూ ఒకటేనన్న సందేశం ఇవ్వడానికి తాను ముస్లిం కుటుంబాలకు సరకులను పంపిణీ చేశానని తెలిపారు. నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలుండే ముస్లింలకు తన వంతుగా పండుగకు ముందు సరకులను అందించడం సంతోషంగా ఉందన్నారు. అవసరమున్న వారికి చేయూత ఇవ్వడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. అదే విధంగా తాను 600 కిట్లను తయారు చేశామని ఎంపిక చేసిన కాలనీలో వాటిని పేదలకు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బెస్ట్ ఫ్రెండ్స్ వెల్ఫర్ సొసైటి అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, సాబీర్ హుస్సేన్, తోఫిక్, వర్ష కాంబ్లె, నరేష్, అనిల్, తిరుపతి పాల్గొన్నారు.

మన్నేవార్లకు కోళావార్ సర్టిఫికెట్లు ఇవ్వమనడం ఆక్షేపణీయం



నవతెలంగాణ-ఉట్నూర్

మంచిర్యాల జిల్లా ప్రాంతంలో ఉన్న మన్నేవార్లకు కోళావార్ సర్టిఫికెట్లు ఇవ్వాలని సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అసెంబ్లీ సమావేశాలలో మాట్లాడటం ఆక్షేపణీయమని ఆదివాసీ కొలాం సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టేకం వసంతరావు, ఉట్నూర్ మండలాధ్యక్షుడు సిడాం బాపూరావు అన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ శాసనసభ చివరి రోజు సమావేశంలో ఎమ్మెల్యే హరీష్‌బాబు ఆదివాసీ కొలాం గిరిజనులపై ఎలాంటి అవగాహన లేకుండా మాట్లాడిన మాటలను వెనక్కి తీసుకోవాలన్నారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఎమ్మెల్యే హరీష్‌బాబు మాటలను రికార్డుల నుంచి తొలగించాలన్నారు. ఎమ్మెల్యే తీరుకు నిరసనగా 10 వేల మంది కొలాం గిరిజనులతో ఎమ్మెల్యే ఇల్లు ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. మన్నేవార్లకు కోళావార్ సర్టిఫికెట్లు ఇవ్వద్దన్నారు. ఈ సమావేశంలో టేకం మాధవ్‌రావు, కొడప లక్ష్మణ్, సిడం లక్ష్మణ్, ఆత్రం బాపూరావు పాల్గొన్నారు.

ఉగాది పంచాంగ పుస్తకాలను ఆవిష్కరించిన కలెక్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ముద్రించిన ఉగాది పంచంగ పుస్తకాలను జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆవిష్కరించారు. శుక్రవారం సమితి సభ్యులు ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పంచాంగం అందించి విడుదల చేయించారు. అనంతరం ఎస్పీ అఖిల్ మహాజన్‌ను కలిసి పంచాంగాన్ని అందించారు. ఉగాది రోజు ఆదివారం గోపాల కృష్ణమఠంలో సమితి ఆధ్వర్యంలో ముద్రించిన పంచాంగాన్ని ఉచితంగా పంపిణీ చేస్తామని ప్రమోద్ కుమార్ ఖత్రి తెలిపారు. అదే రోజు పచ్చడితో పాటు గుడాల పంపిణీ ఉంటుందన్నారు. ఈ ఉగాది అందరికి సుఖ సంతోషాలు కల్గించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోశాధికారి సూర్యకాంత్, గౌరవాధ్యక్షుడు బండారి వామన్, నర్సిములు, రవీందర్, పడకంటి సూర్యకాంత్ పాల్గొన్నారు.

నాలుగు రోజులు పంట కొనుగోళ్లు బంద్

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులోని కొనుగోళ్ల కేంద్రాల్లో కందులు, శనగ, పంటలను నాలుగు రోజులు బంద్ నిర్వహిస్తున్నట్టు పీఏసీఎస్ సీఈఓ గొలి స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఉగాది, రంజాన్ పండుగ సందర్భంగా ఈనెల 29 నుంచి ఏప్రిల్ ఒకటవ తేదీ వరకు పంట కొనుగోలు నిలిపివేస్తున్నట్టు తెలిపారు. ఈ విషయాన్ని రైతులు గమనించి నాలుగు రోజులపాటు మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రానికి పంట తీసుకురావద్దని కోరారు. అలాగే రైతులు బంద్‌కు సహకరించాలని కోరారు. తిరిగి ఏప్రిల్ 2 నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని తెలిపారు.

రైతులపై పోలీసుల తీరుకు ఎస్‌కేఎంఎస్ నిరసన

- సంయుక్త కిసాన్ మోర్చా



సంయుక్త కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న నాయకులు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

పంజాబ్‌లో రైతుల నిరసనపై పోలీసుల అణచివేతకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా ఖండిస్తూ ఇచ్చిన దేశవ్యాప్త పిలుపులో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రం ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఏడబ్ల్యుఏ జిల్లా ప్రధానకార్యదర్శి నూతన్ కుమార్, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జే.రాజు మాట్లాడుతూ భగవంత్ సింగ్ మాన్ నేతృత్వంలోని పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, పంజాబ్ పోలీసులు జగ్జీత్ సింగ్ దల్లెవాల్, శ్రవాన్ సింగ్ పాంధర్‌లతో సహా 350 మంది రైతు నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి జైలులో పెట్టారని అన్నారు. ఖనౌరి, శంభు సరిహద్దులలో ఆందోళన చేస్తున్న రైతుల టెంట్లు, వేదికలను పోలీసులు బుల్డోజర్లతో కూల్చివేసి, ట్రాక్టర్ ట్రైలర్లు, ట్రాలీలు ఇతర ఉపకరణాలను ఎత్తుకెళ్లారన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశం మేరకు ఖనౌరి, శంభు పంజాబ్ సరిహద్దులను హర్యానా పోలీసులు మూసివేశారని, రైతు సంఘాలు ఎంఎస్‌పీ, రుణమాఫీ వంటి నిజమైన, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్ల కోసం పోరాడుతున్నాయని, భారతదేశంలో ప్రతిరోజూ 31 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నందున వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడం ద్వారా వారిని అప్పుల నుంచి విముక్తి చేయడం ద్వారా రైతుల పోరాటాన్ని పరిష్కరించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. గత పదేండ్లలో మోడీ ప్రభుత్వం రూ.16 లక్షల కోట్ల కార్పొరేట్ రుణాలను మాఫీ చేసిందని అన్నారు. కానీ ఒక్క రూపాయి కూడా రైతు రుణాన్ని మాఫీ చేయలేదని మండిపడ్డారు. వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించడానికి ఎంఎస్‌పీ, రుణమాఫీ తప్పనిసరి కాబట్టి, కార్పొరేట్ శక్తులకు, పోలీసు అణచివేతకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఆందోళనలో రైతులు ప్రజలు కదిలిరావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఏడబ్ల్యుఏ జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి నాగేళ్లి నర్సయ్య, గిరిజన సంఘం అధ్యక్షులు శంభు, ఏఐకెఎంఎస్ జిల్లా నాయకులు గోనె స్వామి, గుట్ల ప్రసాద్, మంక శ్రీనివాస్, రాములు పాల్గొన్నారు.

రబీ వరి కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్

నవతెలంగాణ-నిర్మల్

రబీ సీజన్‌కు సంబంధించి వరి కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రబీ వరి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వరి కొనుగోలు ప్రక్రియలు ఎటువంటి ఆటంకాలు లేకుండా పూర్తి చేయాలన్నారు. కొనుగోలు ప్రక్రియను చేపట్టే సిబ్బంది మొత్తం వరి కొనుగోలు ప్రక్రియపై పూర్తి అవగాహనను కలిగి ఉండాలన్నారు. ఓపీఎంఎస్ యాప్‌తో పాటు, జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియలను సులభతరం చేసేందుకై ప్రత్యేకంగా రూపొందించిన లోకల్ యాప్‌పై, ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. వరి కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు టెంట్ తాగునీరు తదితర సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు. సరిపడినన్ని గన్నీ బస్తాలు, టార్పాలిన్లు, తూకపు యంత్రాలు, తేమయంత్రాలు, తదితర పరికరాలన్నీ సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. సమావేశంలో ఆర్డీఓ రత్నకళ్యాణి, డీఎస్ఓ కిరణ్ కుమార్, డీఎం వేణుగోపాల్, డీసీఓ పాపయ్య, ఇన్‌ఛార్జ్ డీఆర్డిఓ శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులు బాగుంటేనే సమాజం భద్రం

- ఎస్పీ జానకీషర్మిల



పోలీసులకు వైద్య సేవలు అందించిన సిబ్బందిని అభినందించిన ఎస్పీ జానకి షర్మిల

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ప్రజల శాంతి భద్రతలు కాపాడటంలో నిరంతర ప్రజా క్షేమ కోసం పాటు పడటంలో జిల్లా పోలీసులు బాధ్యతలు నిర్వహిస్తుంటారని సమాజం భద్రంగా ఉంటుందని జిల్లా ఎస్పీ జానకీషర్మిల అన్నారు. ఎండనక, వాననక నిరంతరం సొంత కుటుంబ సభ్యులకు కూడా సమయం ఇవ్వక పోయిన ప్రజల శాంతి భద్రతలు కోసం ఎల్లా వేళల బాధ్యతలు నిర్వహిస్తుంటే వారి ఆరోగ్యం రక్షణను గ్రహించిన జిల్లా ఎస్పీ వారికి ఆరోగ్య భద్రత కోసం జిల్లాలో వైద్య అధికారులతో మాట్లాడి స్వయంగా పర్యవేక్షిస్తూ, మెడికల్ టెస్టులు కోసం క్యాంప్‌ను జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేయించారు. ఇందులో భాగంగా జిల్లాలోని 30 సంవత్సరాల వయస్సుపై బడిన 703 మంది పోలీస్ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షల రిపోర్టులు వచ్చిన తర్వాత సంబంధిత డాక్టర్లకు చూపించి, తగిన మందులు ఇప్పిస్తామని అన్నారు. ఈ పరీక్షలు, వైద్యసేవలు నెల రోజులపాటు జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నిర్విరామంగా జరపటంలో విశేష కృషి చేసిన డాక్టర్లకు, ఆస్పత్రి ల్యాబ్ సిబ్బందికి, పోలీస్ సిబ్బందికి శుక్రవారం నిర్మల్ పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ వారిని సన్మానించారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వైద్యాధికారులు పోలీస్ సిబ్బందికి పరీక్షలు నిర్వహించినందుకు జిల్లా పోలీస్‌ల తరుపున వీరందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అవినాష్ కుమార్, రాజేష్ మీన, ఏఓ యూనస్ అలీ, ఇన్స్‌పెక్టర్‌లు గోవర్ధన్‌రెడ్డి, ప్రేమ్ కుమార్, ప్రవీణ్ కుమార్, కృష్ణ, సమ్మయ్య, ఆర్ఐలు రాం నిరంజన్, శేఖర్, రామకృష్ణ, రమేష్, ఎస్సైలు, ఆర్ఎస్సైలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

శేష జీవితాన్ని సుఖసంతోషాలతో గడపాలి



ఏఓ రాంరెడ్డి దంపతులను సన్మానిస్తున్న కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ శ్యామలదేవి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉద్యోగ విరమణ తర్వాత శేష జీవితాన్ని సుఖసంతోషాలతో పాటు ఆయురారోగ్యాలతో సంతోషంగా గడపాలని అవసరమైతే విహార యాత్రలు చేయాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఈ నెల 31న కలెక్టరేట్ పరిపాలన విభాగం అధికారి ఏఓ రాంరెడ్డి ఉద్యోగ విరమణ పొందుతున్నారు. కాగా వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో శుక్రవారం రెవెన్యు గార్డెన్‌లో ఏఓ ఉద్యోగ విరమణ ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలం 38 సంవత్సరాలు పనిచేసి, సేవలు అందించిన ఏఓ రాంరెడ్డి ఈ నెలలో ఉద్యోగ విరమణ పొందుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని ముందుగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నామని అన్నారు. టైపిస్ట్ హోదా నుంచి ఏఓ వరకు రెవెన్యులో ఎన్నో మంచి సేవలు అందించి తోటి వారికి గురువు అయ్యారని పేర్కొన్నారు. తన సేవలు వంద శాతం పరిపూర్ణంగా అందించారని కొనియాడారు. అవకాశం ఉంటే మళ్లీ తన సేవలను ఉపయోగించుకుంటామని తెలిపారు. ఏఓ రాంరెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో పనిచేయడం భగవంతుని ఆశీర్వాదం వలన అదృష్టం లభించిందనీ ఈ శాఖలో పని చేయడం చాలా సంతృప్తినిచ్చిందన్నారు. టైపిస్టుగా గుడిహత్నూర్‌లో ఉద్యోగంలో చేరి, అక్కడ ప్రజలకు సేవచేసే భాగ్యం కలిగిందని, మూడు సంవత్సరాలు టైపిస్టుగా పూర్తయిన తర్వాత సీనియర్ అసిస్టెంట్ ప్రమోషన్ మూడు సంవత్సరాలుగా ట్రైబల్ ఏరియాలో పనిచేసే అవకాశం, ఆ తరువాత వివిధ హోదాలో పని చేసి కలెక్టరేట్‌లో ఏఓగా ఉద్యోగ విరమణ పొందుతున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ చేతుల మీదుగా సన్మానం పొందడం అదృష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్, తోటి ఉద్యోగులు వారి అనుభవాలను పంచుకున్నారు. అనంతరం శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వినోద్ కుమార్, ఏవిఓ రాజేశ్వర్, సూపరింటెండెంట్ వర్ణ, తహసీల్దార్లు, జిల్లా అధికారులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ : ఇద్దరికి గాయాలు

నవతెలంగాణ-సారంగాపూర్

ఎదురెదురుగా వచ్చిన రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన ఘటన శుక్రవారం మండలంలోని జామ్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జామ్ గ్రామానికి చెందిన నేరడిగొండ శ్రీనివాస్(45) ఉపాధి పనికి వెళ్లి బైక్‌పై తిరిగి ఇంటికి వస్తుండగా మలక్ చించోలి చెందిన తాండ్ర సాయన్న(35) నిర్మల్ వైపు వెళుతూ జామ్ గ్రామ కమాన్ వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. కాళ్లకు ఒకరికి మరొకరికి తలలకు గాయాలయ్యాయి. వెంటనే 108 సర్వీసుకు సమాచారం ఇవ్వడంతో ఈఎంటి ప్రభాకర్, పైలట్ సంతు జ్ఞానేశ్వర్, క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించి, మెరుగైన చికిత్స నిమిత్తం నిర్మల్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.



రూ.30 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన డీఎంఈఓ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ డీఎంహెచ్ఓ కార్యాలయంలో లంచం తీసుకుంటూ ఓ అధికారి పట్టుబడ్డాడు. జిల్లా వైద్యారోగ్యశాఖ జిల్లా మాస్ మీడియా అధికారి రవిశంకర్ ఏసీబీ అధికారుల వలలో పడ్డారు. ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... కొద్ది రోజుల కింద గుడిహత్నూర్ మండల కేంద్రంలో ఓ మహిళకు అబార్షన్ చేసి ఆమె మృతికి కారణమైన కేసులో మందులు ఇచ్చిన మెడికల్ షాపు యాజమనిని అందులో నుంచి తప్పించడానికి సదరు అధికారి రూ.లక్ష డిమాండ్ చేశాడు. బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో శుక్రవారం కార్యాలయం ఆవరణలో ఉన్న వేప చెట్టు కింద రూ.30 వేలు అధికారికి ఇస్తున్న సమయంలో ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సిలికన్ పరీక్ష నిర్వహించి, సొమ్మును స్వాధీనం చేసుకొని అధికారిని అరెస్టు చేశారు. రసాయన పరీక్షలో ఎడమ చేతి వేలు పాజిటివ్ అని తేలిందని అలాగే ఎడమ వైపు ప్యాంట్ జేబు లోపలి ఫ్లాప్ కూడా రసాయన పరీక్షలో పాజిటివ్ వచ్చిందని పేర్కొన్నారు. కరీంనగర్ ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టనున్నట్టు ఏసీబీ డీఎస్పీ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ సమస్యల పరిష్కారంపై అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, కమీషన్ సభ్యులు రాంబాబునాయక్, కె.లక్ష్మినారాయణ, కుస్రం నీలాదేవి, రేణికుంట్ల ప్రవీణ్, జిల్ల శంకర్, డీసీపీఏ భాస్కర్, జిల్లా అటవీ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్‌లతో కలిసి జిల్లా అధికారులు, కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ ఎస్టీ సమస్యలను పరిష్కరించి బాధితులకు సత్వరమే న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అట్రాసిటీ కేసులు పరిష్కరించేందుకు కృషి చేయాలని, పాత కేసులను మే 31వ తేదీలోగా పూర్తి పరిష్కరించాలన్నారు. ఎస్సీ, ఎస్టీల భూ సమస్యలపై అందిన దరఖాస్తులను ఏప్రిల్ 30 లోగా పరిష్కరించాలన్నారు. ఉపాధిహామీలో ఎస్సీ, ఎస్టీ కూలీల సంఖ్య పెంపొందించి 100 శాతం పని కల్పించాలన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన జీఎం..

తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ సీసీసీలోని సింగరేణి గెస్ట్ హౌస్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. చైర్మన్ వెంట ఎస్సీ ఎస్టీ కమీషన్ సభ్యులు నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ ఉన్నారు.

భూ నిర్వాసిత కుటుంబాలకు ఉద్యోగావకాశాలు కల్పించాలి

నవతెలంగాణ-జైపూర్

జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ విస్తరణలో భూములు నష్టపోతున్న కుటుంబాల వారికి అర్హతకు తగినట్టుగా ఉద్యోగావకాశం కల్పించాలని బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి, జాతీయ సేఫ్టీ కమిటి సభ్యులు కొత్తకాపు లక్ష్మారెడ్డి కోరారు. శుక్రవారం సింగరేణి భవన్‌లో సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరామ్ నాయక్‌ను సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అండ్ ప్రొటెక్షన్ యూనియన్ (బీఎంఎస్) నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. సీఎండీ బలరామ్ నాయక్ సానుకూలంగా స్పందిచారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పులి రాజిరెడ్డి, మండ రమాకాంత్, దుస్స భాస్కర్, బోడకుంట శ్రీధర్, పెద్దిరెడ్డి, కిషన్‌రెడ్డి, చిలకాని వెంకటేష్, సతీష్ పాల్గొన్నారు.

ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా

నవతెలంగాణ-మందమర్రి

ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటి ఆధ్వర్యంలో సీఐ శశిధర్‌రెడ్డి చేతుల మీదుగా ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాను అందచేశారు. సీఐ మాట్లాడుతూ ముస్లిం సోదరులు ఎంతగానో ఆదరించే అల్లాకు ఉపవాసం ఉంటూ భక్తిని చాటుకుంటారు. వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ అజీమోద్దీన్ మాట్లాడుతూ హిందూ ముస్లిం లందరూ అన్నతమ్ముల్లాగా పండుగలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నందిపాట రాజ్ కుమార్, కార్యదర్శి గాండ్ల సంజీవ్, మండల అధ్యక్షుడు సకినాల శంకర్, జావిద్ పాషా, ఎండీ ఇసాక్, వెంకటేష్ పాల్గొన్నారు.

సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు కల్పించాలి

నవతెలంగాణ-జన్నారం

నిరుద్యోగ కళాకారులకు సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు కల్పించాలని తెలంగాణ నిరుద్యోగుల కళాకారుల యాక్షన్ కమిటీ రాష్ట్ర నాయకులు లింగంపల్లి రాజలింగు, కొండుకూరి రాజు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నిరుద్యోగుల కళాకారులపై అసెంబ్లీలో శాసనమండలిలో మాట్లాడిన సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌రావు. మెదక్ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కళాకారులు ఆవునూరి సత్యం, గూడ రాజేందర్, కొల్లూరి మహేష్ పాల్గొన్నారు,

ఇందారం-1ఏ గనిలో సంతకాల సేకరణ

నవతెలంగాణ-జైపూర్

ఇందారం-1ఏ గని అధికారులు హెచ్ఎంఎస్ నాయకులపై చేసిన ఆరోపణలకు నిరసనగా శుక్రవారం కార్మికులు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. హెచ్ఎంఎస్ సెంట్రల్ కమిటీ నాయకులు తిప్పారపు సారయ్య శుక్రవారం సంతకాలు సేకరించారు. సింగరేణి అధికారుల సంఘం హెచ్ఎంఎస్ యూనియన్‌పై చేసిన ఆరోపనలను కార్మికులు తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో హెచ్ఎంఎస్ నాయకులు అనిల్ రెడ్డి, కంబాల నరసయ్య, మీసా కొమురయ్య రవీందర్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్ల ఆందోళన

నవతెలంగాణ-మంచిర్యాల



అసెంబ్లీలో ట్రాన్స్ జెండర్‌ల పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీష్‌రావు ప్రశాంత్ రెడ్డి మాట్లాడిన మాటలను ఖండిస్తూ స్థానిక ట్రాన్స్ జెండర్లు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ఆందోళన చేపట్టారు. ట్రాన్స్ జెండర్స్ అధ్యక్షురాలు సీహెచ్ అర్చన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ట్రాన్స్‌జెండర్‌లకు అనేక కార్యక్రమాలు చేపట్టిందని కానీ అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్ష ఎమ్మెల్యేలు సమస్య ప్రస్తావనకు వచ్చినప్పుడు అవహేళనగా నవ్వడం సిగ్గుచేటని బేషరతుగా ఎమ్మెల్యేలు ట్రాన్స్ జెండర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అన్ని జిల్లాల్లో ఆందోళన కార్యక్రమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.. ఇందులో మాతృఛాయా ఫౌండేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ నాంపల్లి నీతూ, ట్రాన్స్ జెండర్‌లు పాల్గొన్నారు.